


# విజయభాను





విశాఖపట్నం, ఆదివారం 17-01-2021 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 109 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## ఏపీలో కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రారంభం..

### వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించిన సీఎం జగన్



సీఎం జగన్ సమక్షంలో ఏపీలో తొలి టీకా వేయించుకుంటున్న స్వీపర్ బి.పుష్పకుమారి

విజయవాడ: సర్వజనాసుపత్రి (జీజీహెచ్)లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీకా కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ముందుగా ఆయన వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. హెల్త్ వర్కర్ పుష్పకుమారికి తొలి టీకాను వైద్యులు వేశారు. అనంతరం హెల్త్ వర్కర్లు నాగజ్యోతి, జయకుమార్, స్టాఫ్ నర్సు మరియమ్మ, డా.ప్రణీతలకు వ్యాక్సిన్ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 332 కేంద్రాల్లో 3.87 లక్షల మందికి తొలిదశలో వ్యాక్సిన్ వేయనున్నారు. విజయవాడలోని గన్నవరం వ్యాక్సిన్ స్టోర్ నుంచి అన్ని జిల్లాలకు వ్యాక్సిన్‌ను పంపిణీ చేశారు. శనివారం ఉదయం నుంచి ఆయా కేంద్రాల వద్ద నిర్ణయించిన మేరకు ఆరోగ్యశాఖలో పనిచేసే (ఫ్రంట్‌లైన్ వర్కర్‌లు) అందరికీ వ్యాక్సిన్ వేయనున్నారు. ఒక్కోకేంద్రం వద్ద రోజుకు 100 మందికి చొప్పున మొత్తం రోజుకు 33,200 మందికి వ్యాక్సిన్ వేసేలా చర్యలు చేపట్టారు. మొదటి డోసు టీకా ప్రక్రియ సుమారు 15 రోజుల పాటు కొనసాగుతుంది. ఆ తర్వాత 28 రోజులకు రెండో డోసు ఇస్తారు. ఇప్పటి వరకూ రాష్ట్రానికి 4.7 లక్షల కోవిషీల్డ్, 20 వేల కోవాక్సిన్ టీకా డోసులు వచ్చాయి. ప్రతి సెంటర్ వద్ద డాక్టర్ పర్యవేక్షణ ఉంటుంది.

వ్యాక్సినేషన్ కేంద్రం వద్ద భౌతిక దూరం పాటించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి సెంటర్‌లో ఆరుగురు సిబ్బంది పనిచేస్తారు. వ్యాక్సిన్ వేసిన తర్వాత ఎవరిలోనైనా దుష్ప్రభావాలు కనిపిస్తే వారికి తక్షణమే వైద్యసేవలు అందించేందుకు ప్రతి బోధనాసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. చదవండి: మనసున్న మారాజు మా జగనన్న..

## ప్రపంచానికి ఉదాహరణగా భారత్..

### కన్నీటి పర్యంతమైన మోదీ



దిల్లీ: కరోనా పోరులో ఎన్నో విషయాల్లో భారత్ ప్రపంచానికి ఉదాహరణగా మారిందని మోదీ అన్నారు. 'చైనాలో వైరస్ విజృంభించిన తర్వాత అక్కడ చిక్కుకుపోయిన తమ పౌరులను తీసుకొచ్చేందుకు అనేక దేశాలు ఇబ్బందిపడ్డాయి. వారిని స్వదేశాలకు తీసుకురాలేకపోయాయి. కానీ భారత్ ముందుకొచ్చింది. వందే భారత్ మిషన్ ద్వారా చైనాలో చిక్కుకుపోయిన భారతీయులనే గాక, ఇతర దేశాల ప్రజలను కూడా అక్కడి నుంచి బయటకు తీసుకురాలగలిగింది' అని మోదీ తెలిపారు.

'కరోనా మహమ్మారి ఎన్నో చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. ఎంతో మంది తల్లుల కడుపుకోతకు కారణమైంది' అని టీకా పంపిణీ ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ కన్నీటిపర్యంతమయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాక్సిన్ ప్రక్రియను మోదీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కరోనా పోరులో గతేడాది ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు.

'దేశం నుంచి కరోనాను తరిమికొట్టేందుకు లక్షల మంది వైద్య సిబ్బంది, ఫ్రంట్‌లైన్ వర్కర్లు నిర్విరామంగా పనిచేశారు. ఈ క్రమంలో వారు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విధుల కోసమని వెళ్లిన సిబ్బందిలో కొంతమంది ఇంటికి తిరిగి రాలేదు' అని చెబుతూ ప్రధాని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వ్యాధి ఎన్నో చేదు జ్ఞాపకాలను మిగిల్చిందని, కరోనా కారణంగా ఎంతోమంది తల్లులు తమ పిల్లలకు దూరంగా ఉండాల్సి వచ్చిందన్నారు. ఆసుపత్రుల్లో

తరువాయి 2లో..

## తెలుగు రాష్ట్రాల సీఎంలకు షెకావత్ లేఖ

దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల డీపీఆర్‌లు వెంటనే సమర్పించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రులిద్దరికీ షెకావత్ లేఖ రాశారు. గత ఏడాది అక్టోబరు 6న జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమల్లో భాగంగా డీపీఆర్‌లు అందివ్వాలని లేఖలో పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదులపై నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు పరస్పరం కేంద్రానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇరు రాష్ట్రాల ఫిర్యాదులపై కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ స్పందిస్తూ డీపీఆర్‌లు సమర్పించాల్సిందిగా కోరింది.

తెలంగాణ, ఏపీ చేపట్టిన కొత్త ప్రాజెక్టులకు అనుమతి తప్పనిసరి అని కేంద్ర మంత్రి షెకావత్ తెలిపారు. కృష్ణాపై 8, గోదావరిపై 7 ప్రాజెక్టుల డీపీఆర్‌లు తెలంగాణ ఇవ్వాలన్నారు. డీపీఆర్‌లు సహా అన్ని రకాల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అయితే ఇప్పటివరకు తెలంగాణ నుంచి ఒక్క డీపీఆర్ కూడా రాలేదని వెల్లడించారు. రాయలసీమ ఎత్తిపోతలపై నిబంధనల మేరకు డీపీఆర్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించారు. పట్టిసీమ 3వ దశ డీపీఆర్ ఇవ్వాలని గోదావరి బోర్డును కోరారు. పురుషోత్తమపురం మినహా దేనికీ డీపీఆర్ ఇవ్వలేదన్నారు. కృష్ణాపై 15, గోదావరిపై 4 కొత్త ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం

తరువాయి 2లో..

## పేషెంట్ జీరోను ఎప్పటికీ కనుక్కోలేము..!

### ప్రపంచ ఆరోగ్య సంస్థ




జెనీవా: ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెట్టిన కరోనా వైరస్ మహమ్మారి మూలాల శోధన ప్రారంభమైంది. ఇందుకోసం ప్రపంచ ఆరోగ్యసంస్థ నేతృత్వంలోని నిపుణుల బృందం వుహాన్‌కు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే, కరోనా వైరస్ సోకిన తొలి వ్యక్తి 'పేషెంట్ జీరో'ను కనుక్కోవడం అసాధ్యమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది.

పేషెంట్ జీరోను ప్రపంచం ఎన్నటికీ కనుక్కోకపోవచ్చని డబ్ల్యూహెచ్‌ఓ వ్యాధుల విభాగం సాంకేతికాధిపతి మారియా వ్యాన్ కోర్కోవ్ అభిప్రాయపడ్డారు. కరోనా వైరస్ మూలాలను శోధించడం కోసం పది మందితో కూడిన నిపుణుల బృందం వుహాన్‌లో అడుగుపెట్టిన సమయంలోనే డబ్ల్యూహెచ్‌ఓ ఈ విధంగా స్పందించడం గమనార్హం.

అయితే, సుదీర్ఘ కాలం తర్వాత అక్కడికి చేరుకోవడంపైనా అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దర్యాప్తునకు చైనా తొలినుంచి అడ్డుపడుతున్న విషయం తెలిసిందే.

ఇక ప్రపంచవ్యాప్తంగా కొత్తరకం కరోనా వైరస్‌లు బయటపడుతోన్న నేపథ్యంలో డబ్ల్యూహెచ్‌ఓ ప్రపంచ దేశాలను అప్రమత్తం చేసింది. వీటిని

తరువాయి 2లో..

## 28 రోజుల తర్వాత రెండో విడత వ్యాక్సిన్



విజయనగరం: దేశంలో ప్రధానమంత్రి మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం శుభ పరిణామం అన్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా కరోనా వ్యాక్సిన్ తొలి టీకా అందించనున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 26 వేల మంది పబ్లిక్, ప్రైవేటు హెల్త్ సిబ్బందికి వ్యాక్సిన్ అందిస్తున్నామని వెల్లడించారు. 5 రోజుల వరకు ఈ కార్యక్రమం చేపడతామని, జిల్లాలో 15 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో సెంటర్ ద్వారా రోజుకి 100 మందికి వ్యాక్సిన్ అందిస్తామని, ఫ్రెంట్ లైన్ వారియర్స్‌కు అందరికి వ్యాక్సినేషన్ అందిస్తామన్నారు. 18 ఏళ్ల లోపు ఉన్నవారికి, బాలింతలకి వ్యాక్సిన్ వేయబడదన్నారు. రెండో విడత కూడా ఇదే రకం వ్యాక్సిన్ అందజేయాలన్నారు. ఇప్పుడు వ్యాక్సిన్ వేసిన వ్యక్తికి మరలా 28 రోజుల తర్వాత రెండో విడత వ్యాక్సిన్ అందజేస్తామన్నారు. రాబోయే రోజుల్లో వ్యాక్సిన్ అందజేస్తామని, ఎవరూ తొందరపడొద్దని మంత్రి పేర్కొన్నారు.

## ఏపీలో కొత్తగా 114 కరోనా కేసులు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో 25,542 మందికి కరోనా పరీక్షలు చేయగా 114 మందికి పాజిటివ్ వచ్చింది. దీంతో మొత్తం కేసుల సంఖ్య 8,85,824కు చేరింది. నిన్న ఒక్క రోజే కరోనా నుంచి కోలుకుని 326 మంది డిశ్చార్జ్ అవ్వగా.. మొత్తం 8,76,372 మంది డిశ్చార్జ్ అయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 1,987.

వైరస్ బాధితుల్లో కొత్తగా ఒక్కరు కూడా మృత్యువాతపడలేదు..

మొత్తం మృతుల సంఖ్య 7,139గా ఉంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్యశాఖ శనివారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.






## దశలవారీగా అందరికి వ్యాక్సినేషన్

### ఒక్కొక్కరు రెండు డోసులు వేసుకోవాలి

### హోం మంత్రి మేకతోటి సుచరిత



గుంటూరు: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఉదయం కోవిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని హోం మంత్రి మేకతోటి సుచరిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాల గిరిధర్, కలెక్టర్ శామ్యూల్ ఆనంద్, జేసి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ.. 'ఇవాళ చాలా ఆనందంగా ఉంది. కరోనా మహమ్మారితో చాలా ఇబ్బంది పడ్డాం. కనీవిని ఎరుగని విపత్తు చూశాం. కరోనా వల్ల ప్రపంచం మొత్తం స్తంభించడం చూశాం. మన దేశంలోనే వ్యాక్సిన్ తయారు చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు వ్యాక్సిన్ తయారీ మొదలు పెట్టి సఫలమయ్యాయి' అన్నారు.

'గుంటూరు జిల్లాలో

తరువాయి 2లో..

# రెడ్ క్రాస్ కార్యదర్శి దాసుబాబు మృతి

శ్రీకాకుళం : రెవిన్యూ శాఖలో అనేక కీలక పదవులు నిర్వహించి, ప్రస్తుతం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న డి.కె.దాసుబాబు శనివారం శ్రీకాకుళం నగరంలో నక్కవీధిలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈయన వయస్సు 70 సంవత్సరాలు. 2010 లో శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం పరిపాలనా అధికారిగా పదవీ విరమణ చేశారు. మంచి పరిపాలనా దక్షునిగా పేరుగాంచిన దాసుబాబు మరణవార్త తెలుసుకున్న పలువురు ప్రముఖులు - కిమ్స్ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. రెడ్ క్రాస్ శ్రీకాకుళం జిల్లా శాఖ చైర్మన్ పి.జగన్మోహన్ రావు ప్రమాద వార్త తెలిసిన వెంటనే నక్కవీధి చేరుకొని కిమ్స్ ఆసుపత్రికి దాసుబాబును అంబులెన్స్ లో తరలించారు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. డి.కె.దాసుబాబు శ్రీకాకుళం నగరంలో హౌసింగ్ బోర్డ్ కాలనీ లో నివాసం ఉంటున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లు గా పనిచేసిన డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, అనిల్ చంద్ర పునేఠా, ఎన్.రమేష్ కుమార్ ల వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. శ్రీకాకుళం కలెక్టర్ క్యాంప్ ఆఫీసుకు సమీపంలో నాగావళి నది ఒడ్డున వెలిసిన కల్యాణ వెంకటేశ్వర ఆలయం నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆనంద నిలయం నిర్మాణానికి ఎంతో కృషి చేసారు. శ్రీకాకుళం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు దాసుబాబు, రెడ్ క్రాస్ సభ్యులు బలివాడ మల్లేశ్వర రావు, డా.కె.సుధీర్, డా నిక్కు అప్పన్న, ఇతర సభ్యులు మరణ వార్త విని విచారం వ్యక్తం చేసారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# మొదటి రోజు వాక్సినేషన్ ప్రశాంతం

## 1,369 మందికి వేక్సినేషన్

శ్రీకాకుళం : జిల్లాలో మొదటి విడత కోవిడ్ వాక్సినేషన్ కార్యక్రమం శనివారం ప్రారంభం అయింది. మొదటి రోజు వాక్సినేషన్ కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజు వాక్సినేషన్ కార్యక్రమం 18 కేంద్రాలలో ప్రారంభం జరిగింది. మొదటి రోజు 1,369 మందికి వాక్సిన్ ఇవ్వడం జరిగింది. వాక్సినేషన్ దుష్ప్రభావాలు జరిగినట్లు జిల్లాలోని ఏ కేంద్రం నుండి కూడా రిపోర్టు కాలేదు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి ధర్మాన క్రిష్ణదాస్, రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి డా.సీదిరి అప్పల రాజు టెక్కలిలో జిల్లా ఆసుపత్రిలో ప్రారంభించారు. శ్రీకాకుళం శాసన సభ్యులు ధర్మాన ప్రసాద రావు శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పాల్గొనగా, పాలకొండ శాసన సభ్యులు విశ్వసరాయి కళావతి పాలకొండ ఏరియా ఆసుపత్రిలో కార్యక్రమం ప్రారంభించారు.

ఎచ్చెర్ల శాసన సభ్యులు గొర్లె కిరణ్ కుమార్ ఎచ్చెర్ల, రణస్థలంలలో వాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారులు, వాక్సినేషన్ కు నియమించిన వైద్య శాఖ పర్యవేక్షణ అధికారులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ వాక్సినేషన్ కార్యక్రమం జరుగుతున్న తీరును ఎచ్చెర్ల, రాజాం తదితర ప్రాంతాల్లో పరిశీలించారు.


# ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ శాసన మండలి పర్యటన

## జిల్లా కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ శాసన మండలి జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ జె.నివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. తెలుగు భాష మరియు సంస్కృతి అభివృద్ధి పై శాసన మండలి సభ్యులు పర్యటిస్తారని, పర్యటనలో భాగంగా పట్టణంలోని కాథనిలయాన్ని సందర్శించడం జరుగుతుందని ఆయన సదరు ప్రకటనలో తెలిపారు. కమీటీ చైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్, సభ్యులు బుద్ధా వెంకటేశ్వరరావు, కె.ఎస్.లక్ష్మణ రావు, కత్తి నరసింహారెడ్డి, ఎ.ఎస్.రామకృష్ణ, వి.సుబ్రహ్మణ్యం తదితరులు కార్యక్రమాలలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ వివరించారు.

# 'చరిత్రాత్మక తీర్పునకు తిరుపతి వేదిక కావాలి'

## తెదేపా అధినేత చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలపై 150 దాడులు జరిగేవరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని తెదేపా అధినేత చంద్రబాబు ఆరోపించారు. ఆలయాలపై జరిగిన దాడులతో రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని.. ఉన్మాదులు, మతిస్థిమితం లేనివారే దాడులకు పాల్పడ్డారని భోగి రోజు డీజీపీ అన్నారని పేర్కొన్నారు. కనుమ రోజు మాట మార్చిన డీజీపీ.. ఆలయాలపై దాడులను ప్రతిపక్షాలకు అంటగడుతున్నారంటూ మండిపడ్డారు. దాడులు చేసిన వైకాపా వాళ్లను కేసుల నుంచి తప్పిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిపై ఉన్న భక్తితో దాడులను బయటపెట్టిన వాళ్లపై కేసులు పెడతారా?విధ్వంసాలు చేసిన వైకాపా వాళ్లపై కేసులు లేవా? అని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి స్క్రిప్ట్, సీఎం జగన్ డైరెక్షన్‌లో డీజీపీ బాగా నటిస్తున్నారని చంద్రబాబు ఎద్దేవా చేశారు. వైకాపా దుర్మార్గాలు, అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలకు తిరుపతి ఉపఎన్నిక అవకాశం లాంటిదన్నారు. వైకాపా ఓటమి ద్వారా చరిత్రాత్మక తీర్పునకు తిరుపతి వేదిక కావాలని.. దేశానికే ఒక సందేశాన్ని తిరుపతి ప్రజలు పంపాలని చంద్రబాబు కోరారు.

# రెండో రోజు ఆట రెండు సెషన్లే

బ్రిస్బేన్: బోర్డర్-గావస్కర్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టు శనివారం రెండు సెషన్లే జరిగింది. టీ విరామం అనంతరం వర్షం కురవడంతో ఆట తిరిగి ప్రారంభంకాలేదు. అప్పటికి 26 ఓవర్లలో భారత్ స్కోర్ 62/2గా నమోదైంది. శుభ్‌మన్‌గిల్(7), రోహిత్ శర్మ(44బీ 74 బంతుల్లో 6-4) ఔటవ్వగా.. పుజారా (8లి), రహానె(2లి) క్రీజులో ఉన్నారు. ఆస్ట్రేలియా కన్నా భారత్ ఇంకా 307 పరుగుల వెనుకబడి ఉంది. అంతకుముందు ఆస్ట్రేలియా 369 పరుగులకు ఆలౌటైంది.

**మెరిసిన శార్దూల్, సుందర్, నటరాజన్..**

274/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో శనివారం రెండో రోజు ఆట ప్రారంభించిన ఆస్ట్రేలియా మరో 95 పరుగులు చేసి చివరి ఐదు వికెట్లు కోల్పోయి 369కు ఆలౌటైంది. కెప్టెన్ టిమ్‌పైన్(50బీ 104 బంతుల్లో 6 -4), కామెరూన్ గ్రీన్(47బీ 107 బంతుల్లో 6%ఇ%4) ఆరో వికెట్‌కు 111 పరుగులు జోడించారు. ఈ క్రమంలోనే ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని శార్దూల్ ఠాకూర్ విడదీశాడు. జట్టు స్కోర్ 311 వద్ద పైన్‌ను ఔట్ చేశాడు. తర్వాతి ఓవర్‌లోనే వాషింగ్టన్ సుందర్ గ్రీన్‌ను బోల్తాకొట్టించాడు. మళ్లీ శార్దూల్ తదుపరి ఓవర్‌లో కమిన్స్(2)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఆస్ట్రేలియా 4 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు కోల్పోయింది. తర్వాత స్టార్క్(20), లైయన్(24) ధాటిగా ఆడి జట్టు స్కోర్‌ను 350 దాటించారు. ఈ నేపథ్యంలోనే వాషింగ్టన్ సుందర్ మరోసారి మెరిశాడు. ఓ చక్కటి డెలివరీతో లైయన్‌ను బౌల్డ్ చేశాడు. కాసేపటికే నటరాజన్.. హేజిల్‌వుడ్(11) బౌల్డ్ చేయడంతో ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. టీమ్‌ఇండియా బౌలర్లలో నటరాజన్, శార్దూల్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్ తలో మూడు వికెట్లు తీసుకోగా.. సిరాజ్ ఒక వికెట్ పడగొట్టాడు.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన టీమ్‌ఇండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. రెండు, మూడు టెస్టుల్లో ఫర్వాలేదనిపించిన గిల్ కమిన్స్ బౌలింగ్‌లో స్లిప్‌లో స్టీవ్‌స్మిత్ చేతికి చిక్కాడు.

# వ్యాక్సినేషన్ విజయవంతం:

## డా.శ్రీనివాస్



హైదరాబాద్: రాష్ట్రంలో తొలి రోజు చేపట్టిన కరోనా వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతమైందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ సంచాలకులు డా.శ్రీనివాస్ తెలిపారు. టీకా తీసుకున్న ఆరోగ్య కార్యకర్తలు వ్యాక్సిన్ సురక్షితమేనని రుజువు చేశారని పేర్కొన్నారు. కోఠిలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తొలి రోజు రాష్ట్ర వ్యాప్తంగా 140 కేంద్రాల్లో 3,530 మందికి టీకా అందించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ కోసం రెండు నెలలుగా వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఎంతో శ్రమించారని అన్నారు. కరోనాపై పోరాటంలో సీఎం కేసీఆర్ ముందుండి నడిపించారని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, కొవిడ్ వ్యాక్సిన్ సరఫరా చేసిన కేంద్ర ప్రభుత్వానికి డా.శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాక్సినేషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తలేదని డా.శ్రీనివాస్ స్పష్టం చేశారు. మూడున్నర వేల మందికి టీకా వేయిస్తే కేవలం 20 మందిలో మాత్రమే మైనర్ రియాక్షన్లు వచ్చాయన్నారు. టీకా తీసుకున్న చోట ఎర్రగా మారడం, దద్దుర్లు రావడం లాంటివి జరిగాయని.. అలాంటివాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వ్యాక్సిన్ తీసుకున్నవారి ఆరోగ్యాన్ని కొన్ని రోజులు పర్యవేక్షిస్తామన్నారు. టీకా తీసుకున్న 42 రోజుల తర్వాతే యాంటీబాడీస్ వృద్ధి చెందుతాయని వివరించారు. మొదటి డోస్ తీసుకున్న కేంద్రంలోనే రెండో డోస్ తీసుకోవాలని.. వ్యాక్సిన్ తీసుకున్న వారు కూడా కొవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో త్వరలోనే కొవిడ్ వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ముమ్మందు ప్రతి కేంద్రంలో వంద మందికి టీకా ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. 104కు ఫోన్ చేసి వ్యాక్సిన్‌పై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

మొదటి పేజీ తరువాయి

## పేషెంట్ జీరోను ఎప్పటికీ కనుక్కోలేము..!

ఎదుర్కొనేందుకు కరోనా వైరస్ సీక్వెన్సింగ్‌ను చేపట్టాలని అన్ని దేశాలకు పిలుపునిచ్చింది. అయితే, జెనెటిక్ కోడ్ సీక్వెన్సింగ్ విశ్లేషించడం అన్ని దేశాలకు సాధ్యం కాకపోవచ్చని అభిప్రాయపడింది. ఇక కొన్ని దేశాల నుంచి వచ్చేవారికి వ్యాక్సిన్ తీసుకున్నట్లు రుజువు చూపించాలని కోరడాన్ని డబ్ల్యూహెచ్‌ఓ వ్యతిరేకించింది.

ప్రస్తుతం కొన్ని దేశాల్లోనే ప్రారంభమైన టీకా పంపిణీ ప్రక్రియ వచ్చే 100రోజుల్లో అన్ని దేశాల్లో ప్రారంభమవ్వాలని ఆకాంక్షించింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు వ్యాక్సిన్ సమానంగా అందేలా చూడాలని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ గెబ్రెయేసస్ అభిప్రాయపడ్డారు.

## దశలవారీగా అందరికి వ్యాక్సినేషన్

31 వ్యాక్సినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. కోవిడ్ నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కోవిడ్ మహమ్మారిని తరిమేసే కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉంది. ఒక్కొక్కరు రెండు

డోసులు వేసుకోవాలి. వ్యాక్సినేషన్ జరిగిన తరువాత లబ్ధిదారుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. దశలవారీగా అందరికీ వ్యాక్సినేషన్ జరుగుతుంది' అన్నారు సుచరిత.

## తెలుగు రాష్ట్రాల సీఎంలకు షెకావత్ లేఖ

చేపట్టిందని.. ఈ ప్రాజెక్టుల డీపీఆర్‌లు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం మేరకు ఇరు రాష్ట్రాలు నడుచుకోవాలని కోరారు. డీపీఆర్‌లు, ఇతర వివరాలు ఇస్తేనే సమస్య పరిష్కారమువుతుందన్నారు. డీపీఆర్‌లు వెంటనే ఇచ్చేలా చూడాలని ఇరు రాష్ట్రాల సీఎంలకు వేర్వేరుగా లేఖలు రాశారు.

## ప్రపంచానికి ఉదాహరణగా భారత్..

చేరిన వృద్ధులను వారి కుటుంబసభ్యులు కలుసుకోలేకపోయారని తెలిపారు. కరోనాతో ప్రాణాలు కోల్పోయినవారికి సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు కూడా చేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు.

**కష్టమైనా లాక్‌డౌన్ తప్పలేదు..**

'దేశంలో కరోనా వ్యాప్తి పెరుగుతుండటంతో కఠిన చర్యలకు ఉపక్రమించాల్సి వచ్చింది. లాక్‌డౌన్ విధించి ప్రజలను ఇళ్లకే పరిమితం చేయడం అంత సాధ్యమైన పనికాదు. కానీ ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. అయితే ప్రజల సహకారం వల్లే కరోనా వ్యాప్తిని అరికట్టగలిగాం. మహమ్మారిని ఎదుర్కొనే సమయంలో ప్రజలంతా కలిసికట్టుగా ఉన్నారు' అని మోదీ కొనియాడారు.

**దవాయి భీ.. కదయి భీ..**

వ్యాక్సిన్లు వచ్చినా జాగ్రత్తలు మరవొద్దని ప్రధాని మోదీ సూచించారు. టీకా తీసుకున్నా మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటించాలన్నారు. 'ఈ సమయంలో మన కొత్త మంత్రం ఇదే.. దవాయి భీ.. కదయి భీ(మందులతో పాటు జాగ్రత్తలు కూడా)' అని మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

**చౌక ధరకే దేశీయ టీకాలు..**

'శాస్త్రవేత్తల కృషితో దేశంలో రెండు టీకాలు అందుబాటులోకి వచ్చాయి. విదేశీ టీకాలతో పోలిస్తే అత్యంత తక్కువ ధరకే ఈ టీకాలు లభిస్తున్నాయి. అంతేగాక, సాధారణ ఉష్ణోగ్రతల్లోనూ వీటిని భద్రపరిచే వీలుంది' అని మోదీ చెప్పుకొచ్చారు. వ్యాక్సిన్‌పై వదంతులు నమ్మొద్దని దేశ ప్రజలను కోరారు.

# అపూర్వ కలయిక... ఆనందవేడుక

## - గురువులకుసన్మానం... శీష్యులకు ఆశిస్సులు






గాజువాక: దిమిలి యస్.బి.హెచ్.జెడ్.పి. హైస్కూల్ (భాగవతుల సోమన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల)లో 25ఏళ్ళ క్రితం 10వ తరగతి చదువుకున్న పూర్వ విధ్యార్ధులంతా శనివారం దిమిలి యస్.బి.హెచ్.జెడ్.పి. హైస్కూల్ లో కలుసుకున్నారు. విధ్యార్ధుల ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుకున్న 1995-1996 బ్యాచ్ కి చెందిన విధ్యార్ధులు 25 వసంతాలు పూర్తి చేసుకున్న సంధర్భంగా శనివారం గురువులను స్మరించుకుంటూ వారికి ఘనంగా సన్మానం చేసారు. విశ్రాంతి ఉపాధ్యాయులు దక్షిణామూర్తి, సత్యన్నారాయణ, ఎన్.కామేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, కె.రమణ,పి.శివాజీ, చంద్రశేఖర్, ఆర్. శంకరరావు, కె. రాజేష్,(పోస్ట్‌మాష్టర్), యస్.మధులకు శాలువవేసి, పుష్పగుఛ్చానిచ్చి వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనం చేసారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమను ఇన్నేళ్ళుగా విద్యార్థులు గుర్తుంచుకొని, వారి జ్ఞాపకాలను తమతో పంచుకోవడం, ఆత్మీయంగా పలకరించడం ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ తమకు విలువలతో కూడిన విద్యను అందించిన గురువుల వలనే మేము ఇంతటి స్థాయికి ఎదిగామని అన్నారు. గురువులనను కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

ఆర్థికంగా వెనుకబడిన తోటిమిత్రులను, తాము చదువుకున్న పాఠశాలకు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అనంతరం తమలో ఆర్థికంగా వెనుకబడిఉన్న మిత్రులకు 10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి జ్ఞాపకాలను తలచుకొంటూ, సంతోషంగా గడిపారు.

తంతఎక్కడ ఎక్కడనుండో అందరూ వచ్చి కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

# కోవిడ్ టీకా ప్రతీ ఒక్కరికీ అందించాలి



ములగాడ: కోవిడ్ నిర్మూలనకు భారత శాస్త్ర వేత్తలు కనిపెట్టిన కోవిడ్ టీకాను ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే పి. గణబాబు కోరారు. శనివారం మల్కాపురం, శ్రీహరిపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రారంభమైన కోవిడ్ వేక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమ ప్రత్యేకాధికారులను ఈ వేక్సిన్ ఏ విధంగా వేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ వేక్సిన్ సకాలంలో ప్రజలకు అందుబాటులోనికి తీసుకొచ్చిన భారత శాస్త్రవేత్తలకు ముందుగా అభినందనలను తెలిపారు. కొవిడ్ కష్టకాలంలో సేవలు అందించిన వారికి ముందుగా వాక్సిన్ వేయడం శుభపరిణామం, అని అన్నారు. అలాగే ప్రతీ ఒక్కరికీ ఇది అందుబాటులో ఉండేటట్లు, వైద్యుల పర్యవేక్షణలో జరిగేటట్లు అధికారులు బాధ్యతలు వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తేదేపా నాయకులు పోతాబత్తుల శ్రీనివాసరావు, కోరాడ శ్రీనివాసరావు,జోజిబాబు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఘనత ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి దే

## - కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి



శ్రీకాకుళం (కవిటి) : ఆంధ్రప్రదేశ్ కళింగ వెల్ఫేర్ అండ్ డెవల ప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బెందాళం పద్మావతి కవిటి మండలం బొరివంక గ్రామ నేతాజీ యువజన సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ 139 కులాలను 56 కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఘనత మన నవయువ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు.

గత ప్రభుత్వాలు బీసీల అభ్యున్నతి గాలికి వదిలేశారని, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే వాడుకున్నారని, బీసీల అభ్యున్నతి ఒక్క జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమైందన్నారు. ఈ కార్పొరేషన్ ల ఏర్పాటు ద్వారా యావత్ భారతదేశం ఆంధ్ర ప్రదేశ్ వైపే చూస్తున్నారని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను కుల, మత, వర్గ, ప్రాంత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయడంలో తనవంతు కృషి ఉంటుందని దీంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రయత్నిస్తానని ఆమె తెలిపారు. తనపై నమ్మకం ఉంచి నన్ను గుర్తించి ఈ పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, రాజ్యసభ సభ్యులు ఉత్తరాంధ్ర ఇంచార్జ్ వి. విజయసాయి రెడ్డి కి తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. శ్రీ రామ్ ప్రసాద్, ఉద్దానం యూత్ క్లబ్ అధ్యక్షులు డి. సతీష్, నేతాజీ యువజన సంఘం సభ్యులు అజయ్, విజయ్, వినోద్, శ్రీకాంత్, రవి, ప్రసన్న, చలం, జగ్గారావు, మన్మధరావు లతో పాటు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# కరోనా మహమ్మారి అరికట్టడానికి

## కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నారు

### పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి



పాడేరు : భారతదేశంలో మొత్తం కరోనా మహమ్మారి అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నారని పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం ఆమె స్థానిక ప్రభుత్వ పాడేరు ఆసుపత్రిలో కోవిడ్ వాక్సినేషన్ టీకా ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి కరోనా మహమ్మారి మరింతగా ప్రబలకుండా అనేక జాగ్రత్తలు(లాక్డౌన్) తీసుకున్నారని మనదేశంలోనే వ్యాక్సిన్ తయారుకావడానికి ప్రజలకు వ్యక్సిన్ ను తొందరగా అందించడానికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అరకు శాసనసభ్యులు శెట్టి ఫల్గుణ మాట్లాడుతూ ప్రజలందరూ ఈ టీకా వేసుకొని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సలి జాముల వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఏజెన్సీలోని 5 మండల కేంద్రాలలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం శనివారం ప్రారంభించామని అన్నారు. పాడేరు, పెదబయలు, చింతపల్లి, అరకు,రాజేంద్రపాలెం మండల కేంద్రాలలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం మొదలుపెట్టామని తెలిపారు. ఈ రోజు ముందుగా వైద్య ఆరోగ్య సిబ్బంది కి టీకా వేస్తున్నట్లు రెండవ దశలో రెవెన్యూ శాఖ, సచివాలయ సిబ్బంది, పోలీసులు, వాలంటీర్లకు వ్యాక్సిన్ టీకా వేయనున్నట్లు పీవో తెలిపారు. గర్భిణీ స్త్రీలకు, బాలిం తలకు వ్యాక్సిన్ వేయరని ఆయన తెలిపారు. మొట్ట మొదటిగా పాడేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కృష్ణా రావు కి మొదటి వ్యాక్సిన్ వేశారని ఆయన తెలిపారు. 5 కేంద్రాలలో ఒక్కొక్క కేంద్రానికి 500 చొప్పున 2500 డోసులు వచ్చాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బందికి ఈరోజు వ్యాక్సినేషన్ ఇచ్చామని అన్నారు. ప్రభుత్వ వైద్య సిబ్బందికి 101 మందికి వేక్సిన్ టీకా వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.లీలాప్రసాద్, డివిజనల్ సూపరిం డెంట్ ఆఫ్ పోలీస్ రాజ్ కమల్, మండల తాహశీల్దార్ వి.ప్రభాకర్ రావు, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగరావు, సర్కిల్ ఇన్స్పెక్టర్ పైడం నాయుడు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వడ్డిప సంఘటనలో

# దోషులను అరెస్టు చేయకపోతే ఆందోళన

*గ్రామాన్ని సందర్శించిన విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక*

*రాష్ట్ర ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళతామని హామీ*




నర్సీపట్నం : దళితులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసే వరకు విశాఖ దళిత సంఘాల ఐక్యవేదిక అండగా ఉంటుందని ఐక్యవేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు పేర్కొన్నారు. శనివారం రోలుగుంట మండలంలోని వడ్డిప గ్రామాన్ని సందర్శించారు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. అక్కడ నుంచి ర్యాలీ గా మహిళలతో కాలనీలో గల గుడి వద్దకు వెళ్లి సమావేశమయ్యారు. దీనికి ముందుగా ఇంట్లోకి చొరబడి దాడికి గురైన సుజాత గృహాన్ని సందర్శించి సుజాత కుటుంబాన్ని పరామర్శించారు. కొత్తకోట సర్కిల్ ఇన్ స్పెక్టర్ తో మాట్లాడి ఇరువర్గాల పై కేసు నమోదు చేసినట్లు గ్రామస్థులకు తెలియజేశారు. తక్షణమే దోషులను అరెస్టు చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సంఘటనను రాష్ట్ర ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. బాధితులను వెంటనే నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కొత్తపల్లి వెంకటరమణ, ఈతలపాక సుజాత, గుడాల రాంబాబు, ఎం.అప్పలరాజు, రవి సిద్దార్థ్, గ్రామ మాజీ ఎంపిటిసి ముక్కుడు పల్లి నూకరాజు రోలుగుంట డిహెచ్ ఎస్ నాయకులు జగదీష్, బుచ్చెంపేట నుండి భూషణం గురందొరపాలెం నుండి మాజీ ఉప సర్పంచ్ పాల్గుణ,ఈరెల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో పోలీస్ టికెటింగ్ ఏర్పాటు చేశారు.

## ఉపా రద్దు పోరాట కమిటీ మరియు విశాఖ పౌర ప్రజా సంఘాల వేదిక తరపున సీపీఐ కార్యాలయంలో సమావేశం

విశాఖపట్నం :ఉపా రద్దు పోరాట కమిటీ మరియు విశాఖ పౌర ప్రజా సంఘాల వేదిక తరపున సమావేశం శనివారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఉపా పేరిట నమోదు చేసిన అక్రమ కేసులు రద్దు చేయాలని, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర ఉపా రద్దు కమిటీ పిలుపులో భాగంగా జనవరి 20వ తేదీన జీవియంసి గాంధీ విగ్రహం వద్ద ఉదయం 10 గం లకు ధర్నా చేయాలని సమావేశం నిర్ణయించింది. అదేవిధంగా పౌర ప్రజా సంఘాలు, విశాఖ పట్నం తరపున భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుందాం అనే పిలుపుతో నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం భావించింది. దానిలో భాగంగా ఈ విషయం పై కలిసొచ్చే అన్ని సంఘాలను కలుపుకొని ఫిబ్రవరి మొదటి వారాంతంలో సదస్సు నిర్వహించాలని నిర్ణయించింది.

### నర్సీపట్నంలో మొదటి విడత

# కోవిడ్-19 వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభం



వ్యాక్సినేషన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నర్సీపట్నం శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టీవి లో లైవ్ ద్వారా భారత ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ కు శాసన సభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్, నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్.మౌర్య, డిప్యూటీ డిఎం అండ్‌హెచ్ వో డాక్టర్ విజయ లక్ష్మి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నీల వేణి దేవి, తాసిల్దార్ జయ, తదితరులు పాల్గొన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మొదటి వ్యాక్సిన్ ను వేయించుకున్న ఐసిటిసి కౌన్సిలర్ డిపి చంద్రశేఖర్..

నర్సీపట్నం అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, నాతవరం పీహెచ్‌సి లకు ప్రత్యేక అధికారి గా వ్యవహరిస్తున్న సబ్ కలెక్టరు ఎన్ మౌర్య అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూడాల్సిందిగా వైద్య అధికారులకు సూచించారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో మొదటి విడత లో నర్సీపట్నం, నాతవరం, నక్కపల్లి, కోటవురట్ల, రావికమతం పిహెచ్ సి,సిహెచ్‌సి లలో వాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యింది.

# ముగిసిన గోవిందరావు మెమోరియల్ క్రికెట్ పోటీలు



మధురవాడ : గత మూడు రోజుల జరుగుతున్న కీర్తిశేషులు కొర్రాయిగోవిందరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది.మహా విశాఖ 5 వ వార్డ్ పరిధి బొట్టవానిపాలెం యూత్ ఆధ్వర్యంలో13వతేది నుండి15 వరకు జరిగిన ఈ పోటీలను మొల్లి లక్ష్మణరావ, కొర్రాయి గోవింద్ బ్రదర్స్(కొర్రయి సురేష్), ముగడ రమణ, నమ్మి సూరి అప్పారావు,నక్కాన సూర్య ప్రకాష్ లు ఘనంగా నిర్వహించారు. బొట్టవానిపాలెం గ్రామానికి చెందిన 5జట్లు పాల్గొనగా, శనివారం జరిగిన ఫైనల్స్ లో బి.వి.పి జట్టు (బుల్స్) విజేతలుగా నిలిచారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన టిడిపి జిల్లా కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బాని సలు కాకూడదని, జూదం, పేకాట, కోడిపందాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలనే సదుద్దేశంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహణ చేపట్టామని తెలిపారు. గ్రామానికి చెందినయువత అంతా కలిసిమూడు రోజుల పాటు క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొని ఆనందోత్సాహాలతో కలసి మెలసి ఉన్నారని తెలిపారు.

అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ఈకార్యక్రమంలో నమ్మి శ్రీను,ఈగలరవి,నమ్మి రమణ,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కాలనీ లో మౌలిక సదుపాయాలు కొరకు వినతి



లంకెలపాలెం : జర్నలిస్టుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్ కు ఏపీయూడబ్ల్యూజే పరవాడ ప్రస్ క్లబ్ ప్రతినిధులు శనివారం ఉదయం వినతిపత్రం అందజేశారు. మేజర్ పంచాయతీ పరవాడ సర్వే నెంబర్ 11 లో దశాబ్ద కాలం క్రితం 40 మంది ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పిస్తూ అప్పట్లో లేఅవుట్ వేశారని....

మౌలిక సదుపాయాలు లేక జర్నలిస్టులు కట్టుకోలేకపోయారని ఎమ్మెల్యేకు వివరించారు. విద్యుత్తు, తాగు నీరు, రహదారుల వసతి కల్పిస్తే జర్నలిస్టు ఇల్లు నిర్మించు కుంటారని ఎమ్మెల్యేలను కోరారు. జర్నలిస్టుల సమస్యలపై ఎమ్మెల్యే స్పందిస్తూ తక్షణమే మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ప్రెస్ క్లబ్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే పరవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లోకేష్, గౌరవ అధ్యక్షులు సన్యాసిరావు, జిల్లా కమిటీ మెంబర్ రవి,అనిల్, చుక్క గోపి, తదితరులు పాల్గొన్నారు.

## మధురవాడలో

# కోవిడ్ వ్యాక్సిన్ మొదటి దశ ప్రారంభం



మధురవాడ : ప్రజా జీవితాన్ని ప్రపంచాన్ని గడడలాడించిన కరోనా ఇప్పుడు భారతీయ శాస్త్ర వేత్తల మూడు తల వంచింది, కరోనా నుంచి ఇప్పుడిపుడే బయటపడుతున్న ప్రజలకు ప్రధాని మోడీ తీపికబురు అందించారు, ఆన్లైన్ ద్వారా కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియ దేశమంతటా శనివారం అయన మొదలు పెట్టారు దీనితో దేశంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం మొదలైంది. మహా విశాఖ 7వవార్డ్ పరిధి మధురవాడ ప్రాథమిక ఆసుపత్రిలో కోవిడ్ వాక్సినేషన్ మొదటి దశ చేపట్టారు. మొదటగా వైద్యు లకు, పారామెడికల్ సిబ్బందికి, నర్సు లకు, ల్యాబ్ టెక్నీషి యన్లకు, ఆశా వర్కర్లకు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి అందించనున్నారు. ఈ కార్యక్రమము వైద్య అధికారుల పర్యవేక్షణలో మొదటి కోవిడ్ వ్యాక్సిన్ టీకా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమాదేవి చేయించుకున్నారు. మొదటి రోజు 100 మంది ప్రభుత్వ వైద్య సిబ్బందికి వ్యాక్సినేషన్ చేశారు. 3రోజుల పాటు మొత్తం 262 మంది సిబ్బందికి రోజుకి వంద మంది చొప్పున వ్యాక్సినేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు మధుర వాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డా.అశ్విని శైలజ తెలిపారు.

ఈ కార్యక్రమంలో రూరల్ తాసిల్దార్ ఆర్.నరసింహమూర్తి, జివిఎంసి జోన్-1కమీషనర్ బొడ్డేపల్లి రాము,పి.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ సి.ఐ ఎ.రవికుమార్, వైయస్సార్ సిపి నాయకులు 5వవార్డ్ మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంత రావు, జీవీఎంసీ6,7వార్డుల అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీ

ఇప్పటి తరానికి- అంటే 2000 సంవత్సరం తర్వాత పుట్టినవాళ్లకు (పోస్ట్ మిలీనియం జనరేషన్‌కు) టెక్నాలజీ ప్రధాన సాధనం, ఆసక్తి. ఈ టెక్నాలజీ ఆధారిత పరికరాలతో పనిచేస్తుంటారు. ఆధునిక సౌకర్యాలు పొందుతుంటారు. ఇలా నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీతోనే వాళ్ల అనుబంధం పెనవేసుకుంటున్నది. ఏ ఫుడ్ ఏ హోటల్‌లో బాగుంటుందో ఆన్‌లైన్ రివ్యూలు చూసి తెప్పించుకుంటారు. ఎలాంటి బట్టలు కావాలన్నా, సినిమాలు చూడాలనుకున్నా, ప్రయాణాలు చేయాలనుకున్నా, డాక్టర్‌ను కలువాలనుకున్నా ప్రతిదానికీ ఆన్‌లైన్ మార్గమే పరిష్కారం. ఎలక్ట్రానిక్ టెక్నాలజీపైనే విస్తృతంగా ఆధారపడే 'ఇ- జనరేషన్' ఇది. మొబైల్ ఫోన్ ద్వారా కంఫర్ట్ జోన్‌ను ర్పరుచుకున్న తరం ఇతరత్రా కోల్పోతున్నదేమిటో అర్థం చేసుకోలేకపోతున్నది.

యువతరంలో కొందరు ఊహాలోకంలో విహరిస్తూ, సినిమాలు, రకరకాల మీడియాల ప్రభావాలకు లోనవుతూ ప్రేమ, పెండ్లి పేరిట జీవితాలను గందరగోళానికి గురిచేసుకుంటున్నారు. కాలేజీ చదువులప్పుడే తప్పనిసరిగా ప్రేమించాలి, లేకుంటే జీవితం వ్యర్థం అనుకుంటున్నారు. కొంతకాలానికే ప్రేమ విఫలమయిందంటూ ప్రాణాలు తీసుకుంటున్నారు. మరికొందరు ఎదుటివారిపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. కొన్నిసార్లు తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించడంలేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వార్తలు తరచూ మీడియాలో కనిపిస్తున్నాయి. తాజాగా.. పెద్దపల్లి జిల్లాలో ఓ యువకుడు తన ప్రియురాలు చనిపోయిందని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో తన ప్రేమను నిరాకరించిందంటూ ఓ ఇంటర్ అమ్మాయిని యువకుడు పొడిచి చంపాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో తల్లిదండ్రులు తమ పెండ్లికి అంగీకరించడం లేదంటూ యువతీయువకుల జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా అర్ధాంతరంగా బతుకులను ముగించేస్తున్న ఘటనలు సమాజానికి ఆందోళనకరమైన పరిణామం. ఆధునిక శాస్త్ర సాంకేతికాభివృద్ధితో అద్భుత ప్రగతి సాధిస్తున్నట్టు ఒకవైపు భావిస్తుంటే, మరోవైపు మానవ జీవితంలో ఇలాంటి అపసవ్యతలు ఎందుకు సంభవిస్తున్నాయనేది విశ్లేషించుకోవాల్సిన అంశం.

ఈ తరానికి స్వతంత్రంగా ఉండాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. డామినేట్ చేస్తుంది. తమ కంఫర్ట్ జోన్‌కు ఇబ్బందికరమనుకుంటే ఎలాంటివారినైనా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదిరించాలనుకుంటారు. తల్లిదండ్రులతో ఎక్కువగా కలిసి ఉండాలనే ఆలోచన ఉండదు. అలాగే బంధుమిత్రులు.. వాళ్లతో అనుబంధాల విషయంలోనూ భిన్నంగానే ప్రవర్తిస్తుంటారు. ఇలా ఒకవైపు ఏకపక్షంగా జీవించే లక్షణాలుండేవారికి, మరోవైపు కొన్ని సమస్యాత్మక పరిస్థితుల్లో దృఢంగా, ఆత్మవిశ్వాసంతో నిలదొక్కుకునే ట్కస్థైర్యం లోపించడం విచిత్రకరంగా అనిపిస్తుంది. వీటికి కారణాలను అన్వేషిస్తే- పెరుగుతున్న పోటీ, అవాస్తవిక జీవిత లక్ష్యాలు, ఒంటరితనానికి లోనుకావడం వంటి అంశాలని భావించవచ్చు. జీవన నైపుణ్యాలను తగినంతగా అలవరుచుకోలేనప్పుడు సమస్యలు వారిని భయపెడతాయి. ఇతరుల నుంచి సరయిన సహాయ సహకారాలు పొందకుండా రకరకాల ఆలోచనలతో నిర్ణయాలకు వస్తుంటారు. ఇప్పటి ఆధునికత ఆత్మనిబ్బరాన్ని కలిగించలేకపోతున్నది. 'ఇ- జనరేషన్'కు ఇంగితం లోపిస్తున్నది. దానిని సరిదిద్దాల్సి ఉన్నది. టీనేజ్, యువతీయువకులకు విపరీత ఆలోచనలు రావడానికి కారణాలను అనేక రకాలుగా విశ్లేషించుకోవచ్చు. పరిణతి లేకపోవడం, ఎమోషనల్‌గా తొం దరపడటం అనిపించినప్పటికీ వాటికీ పరిష్కారాలను పరిశీలించాలి. ఇంటిలో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, స్నేహితులు, బయట ఇరుగుపొరుగు.. వీరందరితో అనుబంధాలు కూడా కీలక ప్రభావం చూపుతాయని గమనించాలి. అలా పెరిగేవారిలో తొందరపాటు ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవడం తక్కువ. పలు సందర్భాల్లో సమస్యలకు పరిష్కార మార్గాలను పరిశీలించే స్వభావం అలవడుతుంది. తీవ్ర నిర్ణయాలకు వచ్చేవారి లక్షణాలను గమనిస్తే- వాళ్ల ప్రవర్తనలో విపరీత ధోరణులుంటాయి. మాట్లాడటం, నిద్రపోవడం, తినడంలో తేడాలను గమనించాలి. ఇవన్నీ అయితే ఎక్కువగా ఉంటాయి లేదా అసలు ఉండవు. మానసికంగా కుంగుబాటులో ఉంటారు. ఏడుస్తుంటారు. బిగుసుకుపోతారు. చూపుల్లో, చేతల్లో అశాంతి కనిపిస్తుంది. స్తబ్ధుగా లేదా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు.

## జీవీఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, కూరగాయలు పంపిణీ చేసిన వివేకానంద సంస్థ..

విశాఖపట్నం : సంక్రాంతి పండుగ సందర్భంగా.. విశాఖ వన్టౌన్లో ఉన్న శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ పలు సేవా కార్యక్రమాలు చేపట్టింది. ప్రజల ఆరోగ్యం కోసం..అహర్నిశలు శ్రమిస్తోన్న... జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి నూతన వస్త్రాలు, కూరగాయలు పంపిణీ చేసింది. సంస్థ గౌరవ సలహాదారు ఎం.ఎస్.హక్కు చేతుల మీదగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పోలవరపు అప్పలకొండ, దూడ రాజు, కోటం శెట్టి రామారావు తదితరులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దేశీయ టీకా రావడం గర్వకారణం

### అరకు ఎంపి గొడ్డేటి మాధవి



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఎంపి మాధవి

కొయ్యూరు : కరోనా మహమ్మారీని తరిమికొట్టేందుకు దేశీయ టీకా రావడం గర్వకారణమని అరకు ఎంపి గొడ్డేటి మాధవి అన్నారు. రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకు ఎంపి గొడ్డేటి మాధవి కోవిషీల్డ్ టీకా పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాధవి మాట్లాడుతూ కరోనా ప్రారంభ దశలో దాన్ని నియంత్రించడం కొరకు ముందు వరుసలో నిలబడి ఎంతో శ్రమించిన డాక్టర్లకు, స్టాఫ్‌నర్స్ లకు, ఆశా వర్కర్లకు, పారిశుధ్య కార్మికులకు, పోలీస్ సిబ్బంది ఇలా ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. వ్యాక్సిన్ కనుగొనడంలో తీవ్రంగా శ్రమించి కృషి చేసిన దేశం, విదేశీ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ముఖ్యంగా మహమ్మారి కరోనా వైరస్‌కు మన దేశ శాస్త్రవేత్తలు టీకా కనిపెట్టడం దేశ పౌరులుగా ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమని కొనియాడారు.

మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా కోవిషీల్డ్ టీకా అందుబాటులోకి తీసుకుని వచ్చిన ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కోవిషీల్డ్ టీకాలపై విడుదల చేసిన మార్గదర్శకాలను పాటిస్తూ కరోనా కట్టడిలో ముందు వరుసలో నిలబడిన వారు, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టీకా తీసుకోవాల్సిందిగా ఎంపీ సూచించారు. ఈ కార్యక్రమంలో నేను సైతం చారిటబుల్ పౌండేషన్ ఫౌండర్, ఎంపి భర్త శివప్రసాద్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, తహశీల్దార్, కొయ్యూరు సిఐ వెంకటరమణ, ఎంపిడిఒ మేరీరోజ్, వైయస్సార్ సిపి నాయకులు ఉల్లి సూరిబాబు, సుర్ల చందర్రావు, బల్ల ప్రసాద్, నర్సింగ్ శేఖర్, ధర్మరాజు, లక్ష్మణరావు, ఆశా వర్కర్లు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న చర్యలు తప్పవు

మాకవరపాలెం : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అట్లయితే చర్యలు తప్పవని మాకవరపాలెం ఎస్సై కరక రాము తెలిపారు.

మాకవరపాలెం మండలం తాడపాల గ్రామం నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక బండ్లను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా అక్రమంగా తరలించడం ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. కొన్ని గ్రామాల్లో అక్రమంగా ఇసుక రవాణా వారిపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రభుత్వ అవసరాల అనుమతుల ముసుగులో అక్రమంగా రవాణా అవుతున్న తమ దృష్టికి వచ్చిందని ఎంతటి వారినైనా వదిలేది లేదని అందులో భాగంగానే ప్రత్యేక రైడింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నాతవరంలో కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రారంభం



కోవిడ్ టీకా వేస్తున్న దృశ్యం

నాతవరం : నాతవరం పిహెచ్‌సిలో కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియ శనివారం ప్రారంభించారు. ముందుగా నాతవరం పిహెచ్‌సి వైద్యాధికారులు ప్రసన్న, రాజేష్ నాయుడు, గునుపూడి వైద్యాధికారి ముందుగా వ్యాక్సినేషన్, వేయించుకున్నారు ఈ సందర్భంగా నాతవరం వైద్యాధికారి ప్రసన్న మాట్లాడుతూ మాట్లాడుతూ రోజుకి వంద మందికి కోవిడ్ వ్యాక్సిన్, వేయడం జరుగుతుందన్నారు ఈ వ్యాక్సినేషన్ గొలుగొండ మండలం సంబంధించి రెండు వందల ఎనిమిది మందికి, నాతవరం సంబంధించి 147 మందికి, గునుపూడి పిహెచ్‌సి పరిధి సంబంధించి 119 మందికి ఈ వ్యాక్సినేషన్ వేయడం జరుగుతుందన్నారు. ఇందులో వైద్య సిబ్బందికి, ఆశా వర్కర్లకు, అంగన్వాడీ వర్కర్లకు, ఆయాలకు మొదటి దశలో వేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో....

నాతవరం వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు అంకంరెడ్డి జమీల్, నాతవరం తహశీల్దార్ కె.జానకమ్మ, ఎంపిడిఒ యాదగిరిశ్వరరావు, నాతవరం డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది వైద్య సిబ్బంది ఉన్నారు.

## అచ్యుతాపురంలో కరోనా వ్యాక్సినేషన్

### ప్రారంభించిన ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు



అచ్యుతాపురం : మండల కేంద్రమైన అచ్యుతాపురం పిహెచ్ సి లో కరోనా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని యలమంచిలి యువి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) శుక్రవారం ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవిడ్ టీకాలను పరిశీలించి , టీకా గురించి వైద్యులను అడిగి తెలిసికున్నారు . ప్రోగ్రాం ఆఫీసర్ వైద్యులు శ్రీధర్ మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్ 28 రోజుల వ్యవధిలో రెండు డోసులు తీసుకోవాలన్నారు . 80 మందికి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవి జోసఫ్ , ఎంపీడీఓ మహేష్ , వైసిపి నాయకులు కోనా బుజ్జి, లాలం రాంబాబు, నర్మాల కుమార్, పిన్నంరాజు వాసు , వడిశల శ్రీనివాసరావు, దేశంశెట్టి శంకరరావు, కొరుపోలు చిన్నారావు ,ద్వారపురెడ్డి బాబ్జి,వాసుపల్లి శ్రీనివాసరావు, పోలవరపు పారునాయుడు, వైద్యధికారిణిలు రబియా పర్వీన్, అలేఖ్య తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరికి అందుబాటులో కరోనా టీకా

### - ఎమ్మెల్యే నాగిరెడ్డి



టీకా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: ప్రపంచగమనాన్ని అతలాకుతలం చేసి కరోనా మహమ్మారిని నిర్మూలంచే కరోనా టీకా ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉంటుందని, దీనిని ప్రతీ ఒక్కరూ వేసుకోవాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సూచించారు. నియోజకవర్గంలోని గాజువాక ప్రభుత్వ ఆసుపత్రి, పెదగంట్యాడలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం కరోనా నిర్మూలన వేక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ముందుగా కరోనా కష్టకాలంలో సేవలు అందించిన ఫ్రంట్ వారియర్స్‌కి ఈ టీకాను వేసారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ కరోనా టీకాపై ఎటువంటి అపోహాలు పడవద్దని సూచించారు. కరోనా టీకా వేసుకున్న ప్రభుత్వ నిబంధనలు మాత్రం తప్పక పాటించాలని అన్నారు. కరోనా నిర్మూలనకు భారత శాస్త్రవేత్తల కృషి అభినందనీయమని అన్నారు. వారికి దేశ ప్రజలు ఋణపడి ఉంటారని అన్నారు. జోన్-5 జెడ్సీ శ్రీధర్ మాట్లాడుతూ సుమారు సంవత్సరం పాటు భారత శాస్త్రవేత్తలు పరిశోదనలు చేసి, అందుబాటులోనికి తీసుకొచ్చిన టీకాను సకాలంలో అందరికి అందుబాటులోనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావడం శుభ పరిణామమని అన్నారు. మొదటి దశలో కరోనా కష్టకాలంలో సేవలందించిన వారికి ఈ టీకా అందుబాటులోనికి తీసుకోచ్చామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ మాట్లాడుతూ భారత దేశానికి చెందిన రెండు సంస్థలు భారత్ బయోటెక్, సీరంలు కోవాక్జిన్, కోవీసీల్డ్ టీకాను కనుగోన్నారని తెలిపారు. రెండుదశలలో ఈ టీకాను వేయనున్నామని తెలిపారు. మొదటి దశలో వైద్య సిబ్బందికి, రెండోదశలో పోలీసు సిబ్బందికి,పారిశుద్ధ్య సిబ్బందికి, మూడవ దశలో 50సం. దాటిన వారికి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రోజుకు సుమారు 100మందికి ఈ టీకాను వైద్యుల పర్యవేక్షణలో వేయనున్నామని, ఈ నెల 16నుంచి 19వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఎటువంటి ఇబ్బంది కల్గిన వారికి తక్షణమే వైద్య సహాయం చేసేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరూ ఆపోహాలు పడకుండా ఈ వేక్సిన్ వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బంది, వైద్య ఆరోగ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సందర్భంగా సురాజ్యం మాసపత్రిక క్యాలండర్ ఆవిష్కరణ



భీమునిపట్నం : సురాజ్యం మాసపత్రిక క్యాలండర్ ను సంక్రాంతి సందర్భంగా ఆవిష్కరించడమైనది.

ఈ కార్యక్రమా లలో... ఏపీ నాగవంశం వెల్ఫేర్ & డవలప్మెంట్ కార్పోరేషన్ చైర్ పర్సన్ భొడ్డు అప్పలకొండమ్మ, ఏపీ నాగవంశం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డు అప్పల నాయుడు, ఏపీ నాగవంశం సాంస్కృతిక వేదిక & ఏపీ నాగవంశం సంక్షేమ సాధనసమితి అధ్యక్షులు, కన్వీనర్, ప్రధాన కార్యదర్శులు ముని శ్రీరామకృష్ణ, ఎర్నింటి కిట్టు, మొఖర వెంకట మల్లేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్ర టరీ, కోశాధికార్లు కంటుభుక్త ముత్యాలరావు, అవనాపు దేవుడు తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్19 టీకా పనితనం పై అపోహాలు పడవద్దు



ములగాడ: కోవిడ్19 టీకా పనితనం పై అపోహాలు పడవద్దని,కోవిడ్ మహమ్మారి నుంచి రక్షణకు కోవిడ్19 టీకా ప్రతి ఒక్కరూ వేసుకోవాలని, తద్వారా కోవిడ్ మహమ్మారి బారి నుంచి రక్షణ పొందాలని పశ్చిమ వైకాపా ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే మళ్ళా విజయప్రసాద్ కోరారు. భారతదేశం మొత్తం మీద ప్రజలకు కోవిడ్ రక్షణ కోసం కేంద్రం ప్రభుత్వం టీకా పంపిణీ చేస్తున్న తరుణంలో జీవీఎంసీ జోన్ 4 పారిశ్రామిక ప్రాంతం 60వ వార్డు శ్రీహరిపురం గుల్లల పాలెం జీవీఎంసీ హాస్పిటల్( ఎఫ్ ఆర్ యు ), మల్కాపురం జీవీఎంసీ హాస్పిటల్ లో శనివారం టీకా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీహరిపురం జీవీఎంసీ హాస్పిటల్ లో ప్రభుత్వ డాక్టర్ పర్యవేక్షణలో మొదటగా జి. విజయలక్ష్మి (ఏ ఎన్ ఎం) కి కోవిడ్ టీకా వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ మానవాళి జీవితాలను నాశనం చేసిన కోవిడ్ మహమ్మారి ని నిర్మూలించేందుకు ఈ టీకా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ టీకా ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత ఆరోగ్య సంస్థ లు ఆమోదం పొందిందని అన్నారు. దీనిని భారత్ బయో టెక్, సీరం సంస్థలకు చెందిన భారత శాస్త్రవేత్తలు ఏడాది పాటు శ్రమించి కోవగ్జిన్, కోవిషిల్డ్ పేర్లతో ఈ వెక్సిన్ కనిపెట్టారని, దీనిని కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అందుబాటులో కి తీసుకొచ్చిందని తెలిపారు. దీనిపై ఎటువంటి సందేహం అవసరం లేదని, పుకార్లు నమ్మద్దని అన్నారు. ఇది ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వేస్తారని అన్నారు. వలంటీర్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసి సిబ్బంది పర్యవేక్షణలో టీకా ను వెయిస్తారని అన్నారు. ప్రతి ఒక్కరూ టీకా తప్పనిసరిగా తీసుకోవాలని, వ్యాక్సిన్ తీసుకున్నా సరే కేంద్ర ప్రభుత్వం నిబంధనలు తప్పనిసరిగా ప్రజలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోన్4 జెడ్సీ సింహాచలం, 60వ వార్డ్ వైకాపా అభ్యర్థి పి. వి. సురేష్, 59 వ వార్డ్ వైకాపా అధ్యక్షుడు పుర్రి సురేష్ యాదవ్, వైకాపా నాయకులు దాడి సత్యనారాయణ, జీవీఎంసీ ఆరోగ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గోన్నారు.

# పరవాడ పిహెచ్‌సి లో కోవిడ్ వ్యాక్సిన్ ప్రారంభం

## ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అధీప్ హాజరు





పరవాడ : పరవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో (పి. హెచ్.సి) కకోవిడ్ వాక్సిన్ ను శనీవారము ప్రారంభించారు.వాక్సినేషన్ ప్రక్రియ ను ముఖ్య అతిధి గా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ హజరై అయన చేతులు మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు అధీప్‌రాజ్ మాట్లాడుతూ కిందటి సంవత్సరం మార్చ్ నెల నుంచి నేటి వరకు కూడా కరోనా మహమ్మారి విజృంభిస్తుంది. అలాంటి తరుణంలో ఇవాళ భారత దేశం లో కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కానీ పూర్తిగా వ్యవస్థలన్నీ కూడా స్తంభించపోయే విదంగా లాక్ డౌన్ ప్రకటించే పరిస్థితులు కానీ, మనకి తెలిసి ఎన్నో ఇబ్బందులు ఎదురుకున్నాం. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వం లో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అనేక కార్యక్రమాలు చెయ్యడం జరిగింది. అలాగే వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటిని పరిశీలించి ఇవాళ మన దేశం లో నే నూటికి పైగా టెస్ట్ లు చేసినటువంటి రాష్ట్రం ఎదైన ఉంది అంటే అది ఒక్క ఆంధ్ర రాష్ట్రం అని చెప్పారు. అదేవిధంగా శనివారము మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వై.ఎస్‌జగన్మోహన్ రెడ్డి విజయవాడ ప్రభుత్వం ఆసుపత్రిలో ప్రారంభించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జై రామ్, మాజీ అర్ఇసియర్ డైరెక్టర్ సబ్బవరపు నారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు సిరిపురపు అప్పల నాయుడు, పరవాడ తహసీల్దార్ బి.వి రాణి,ఎం.డి.ఓ హేమసుందర్ రావు, సర్పంచ్ అభ్యర్థులు, ఎంపీటీసీ అభ్యర్థులు, నాయకులు, పి.హెచ్.సి డాక్టర్లు ఐ.రవీంద్ర రంజిత్,మరియు వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఏ.ఎన్.ఎంలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యాతపాలెం గ్రామంలో షెటిల్ టోర్నమెంట్



సబ్బవరం : మండలంలోని యాతపాలెం గ్రామంలో శ్రీ కోదండరామ తీర్థం సందర్భంగా శుక్రవారం 111 స్టార్ యూత్ ఆధ్వర్యంలో షెటిల్ టార్నిమెంట నిర్వహించడం జరిగింది. ఈ షటిల్ టోర్నమెంట్లో సుమారు 20 జోడీలు పాల్గొన్నారు. ప్రధమ స్థానంలో శరగడం నానీ, కోనతాల సాధించగా, ద్వితీయ స్థానంలో బోడ్డేటి యోగి,రాపేటి చందూ నిలిచారు .బెస్ట్ ప్లేయర్ గా మళ్ల సూర్య నిలిచారు.ఈ సందర్భంగా యాతపాలెం 111 స్టార్ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

# చోడవరంలో ప్రముఖ ఆలయాలను సందర్శించిన అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి



చోడవరం స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి, సీఐ ఇలియాస్ మహమ్మద్

చోడవరం : చోడవరం పట్టణంలోని స్వయంభు విఘ్నేశ్వర స్వామి, స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయాలను , బుచ్చయ్యపేట మండలం వడ్డాది లో గల వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలను అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి శనివారం సందర్శించారు. ఇటీవల కాలంలో ఆలయాలపై జరుగుతుండడంతో ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఆలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయాలు తీసుకుంటున్న చర్యలు పరిశీలించి పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం సీఐ ఇలియాస్ మహమ్మద్, పాల్గొన్నారు.

## అరకులోయ పాస్టర్స్ ఫెలోషిప్

# నూతన కార్యవర్గం ఎంపిక



అరకులోయ : పాస్టర్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక ఈరోజు అరకులోయ మండలం పెదలబుడు గ్రామంలో జరిగింది. గత కార్యవర్గం పదవీ కాలం గత ఏడాది మార్చి నెలలోనే ముగిసి నప్పటికీ కరోనా కారణంగా నూతన కార్యవర్గ ఎంపిక వాయిదా పడుతూ వచ్చింది. కొత్త కార్యవర్గం లో అధ్యక్షులు గా పెదలబుడు గ్రామ పాస్టర్ రెవరెండ్ వి. ప్రభుదాసు ఎంపిక కాగా, ఉపాధ్యక్షులుగా అరకు లోయ జీజెస్ క్రైస్ట్ చర్చ్ చెందిన పాస్టర్ రెవరెండ్ కె. ఎలీషా, జనరల్ సెక్రెటరి గా బోసుబెడ గ్రామానికి చెందిన పాస్టర్ రెవరెండ్, డాక్టర్. కె.బాబురావు, జాయింట్ సెక్రటరీగా కొర్ర గుడ న్యూ లైఫ్ చర్చికి చెందిన పాస్టర్ రెవరెండ్ శ్యాంసన్, ట్రెజరర్ గా పకన కుడి బిలీవర్స్ చర్చ్ కు చెందిన పాస్టర్ రెవరెండ్ పి. సంతోష్ కుమార్ ఎంపికయ్యారు. మిగిలిన కార్యవర్గ సభ్యులను త్వరలో ప్రకటిస్తామని నూతన సెక్రటరీ పాస్టర్ బాబురావు అన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ప్రభుదాస్ మాట్లాడుతూ తమ నూతన కార్యవర్గం స్థానిక క్రైస్తవ సంఘాల విశ్వాసుల ఐక్యవేదిక తో పాటు, ఇతర క్రైస్తవ సంఘాలనూ, డినామినేషన్ ల భేదము లేకుండా కలుపుకొని ముందుకు సాగుతోందని క్రైస్తవ సంఘటితంగా కలిసి నడవవలసిన సమయంలో మనం ఉన్నామని అన్నారు. అరకులోయ ఐక్యవేదిక సంఘ అధ్యక్షులు పాస్టర్ బురిడి ఆనందరావు మాట్లాడుతూ నూతన కార్యవర్గం తమను సాదరంగా ఆహ్వానించి నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామనీ, తమ సహాయ సహకారాలు ఎప్పుడూ పాస్టర్ ఫెలోషిప్ కు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమానికి అరకులోయ మండల ఉపాధ్యక్షులు పొద్దు అమ్మన్న, మండల తెలుగుదేశం అధ్యక్షులు శెట్టి బాబురావు పాల్గొని నూతన అధ్యక్షులు పాస్టర్ ప్రభుదాస్ కు సన్మానం చేశారు.



పెద్దాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కోవిడ్-19 వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఆర్డీవో ఎస్.మల్లిబాబు

# క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

## వైసీపీ జిల్లా రూరల్ యువజన అధ్యక్షులు లాలం





అచ్యుతాపురం : క్రీడలతో మానసిక , శారీరక ఆరోగ్యంగా ఉంటామని వైసిపి జిల్లా రూరల్ యువజన అధ్యక్షులు లాలం రాంబాబు (రాము) అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా శుక్రవారం భోగాపురం గ్రామంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలకు పూర్వ వైభవం తేవాలన్నారు.

ఈ పోటిలలో ప్రధమ స్థానంలో నారాయణపురం ద్వితీయ స్థానంలో తంతాడి గ్రామాలకు చెందిన టీములు విజేతగా నిలిచాయి. విజేతలకు మండల వైసీపీ నాయకులు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి 10 వేలు, రెండవ బహుమతి 8 వేలు, తృతీయ బహుమతులు అందజేశారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న లాలం రాంబాబును మండల వైసిపి నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ అభ్యర్థి కోనా బుజ్జి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నర్మాల కుమార్, మారిశెట్టి సూర్యనారాయణ, వడిశల శ్రీనివాసరావు, పిన్నంరాజు వాసు, భీముని వెంకటేశ్వరరావు, కూండ్రపు రమణ,బలిరెడ్డి శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షులు లాలం పైడి కొండ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ధర్మశ్రీ చేతుల మీదుగా

# కోవిడ్-19 నివారణకు వ్యాక్సినేషన్ పంపిణీ



చోడవరంలో సిహెచ్‌సి లో వ్యాక్సినేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేతులమీదుగా శనివారం కోవిడ్-19 నివారణకు వ్యాక్సినేషన్ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1980 వ్యాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, విశాఖ జిల్లాలో 32 కేంద్రాల్లో ఏర్పాటు చేశామని, దానిలో చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రం ఒకటన్నారు.

విడతలవారీగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడతామన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు తో పాటు, ఆసుపత్రి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం నిధులు సేకరణ



భీమునిపట్నం: భీమిలి మండలం కృష్ణంరాజు పేట గ్రామంలో అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం నిధులు సేకరిస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు మరియు శ్రీ శ్రవణ చైతన్య స్వామీజీ రామకృష్ణ గ్రామ పెద్దలు శ్రీరామ భక్తులందరూ అందరూ తన వంతు సహాయ సహకారాలు అందించారు. అలాగే భీమునిపట్నం రూరల్ లో ఉన్న తొమ్మిది పంచాయతీలో కూడా రోజుకు ఒక పంచాయతీ చొప్పున శ్రీరామ్ రథం రావడం జరుగుతుంద నీ భక్తులందరూ తమ వంతు సహాయ సహకారాలు శ్రీ రామ మందిర నిర్మాణం కోసం తన వంతు సహకారం ఇవ్వాల్సిందిగా కోరారు.

# సత్యదేవుని నిత్య అన్నదాన పధకానికి రూ.1,00,000/- విరాళం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తూర్పు గోదావరి జిల్లా వేలంగి గ్రామానికి చెందిన మార్ని. సూర్య నారాయణ రూ.1,00,000/- విరాళం ను దేవస్థానం కార్య నిర్వహణా ధికారి వి.త్రినాథరావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో కార్తీక శుద్ధ ద్వాదశి రోజున పట్నాల.లింగయ్య సత్యవతి పేరున అన్నదానం జరిపించాలని కోరారు.ఈ సందర్భంగా ఈవో త్రినాధ రావు దాతలను అభినందించారు.

# ప్రారంభమైన మొదటి విడత వాక్సినేషన్

శ్రీకాకుళం : జిల్లాలో మొదటి విడత కోవిడ్ వాక్సినేషన్ కార్యక్రమం శనివారం ప్రారంభం అయింది. జిల్లాలో ఏర్పాటు చేసిన 18 వాక్సినేషన్ కేంద్రాల్లో కార్యక్రమం ప్రారంభం అయింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన క్రిష్ణ దాస్, రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వాక్సినేషన్ కార్యక్రమంను లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆరోగ్య సిబ్బంది బి.ఉషారాణి మొదటి వాక్సిన్ డోస్ ను తీసుకున్నారు. వాక్సినేషన్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా దేశ ప్రధాని నరేంద్రమోడి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన కార్యక్రమాన్ని ఆన్ లైన్ ద్వారా ప్రదర్శించారు. ప్రధాని నరేంద్రమోడి మాట్లాడుతూ దేశంలో పెద్ద వాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం అవుతోందన్నారు. వాక్సినేషన్ తయారీ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలకు, వారి వైజ్ఞానిక దక్షతకు అభినందించారు. వాక్సినేషన్ కార్యక్రమం జరిగిన 30 రోజుల తరువాత కరోనా వైరస్ ను ఎదుర్కొనే సామర్థ్యం శరీరానికి కలుగుతుందని పేర్కొన్నారు. అప్పటి వరకు ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, చేతులు తరచూ శుభ్రపరచు కోవాలని పిలుపునిచ్చారు. దేశంలో మొదటి విడతలో 3 కోట్ల మందికి, రెండవ విడతలో 30 కోట్ల మందికి వాక్సినేషన్ జరుగుతుందని చెప్పారు. వాక్సిన్ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఖర్చుతో తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి గురజాడ అప్పారావు చెప్పిన దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అనే మాటలను గుర్తుచేశారు. జిల్లాకు పూణే సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా తయారు చేసిన కోవిషీల్డ్ 2,650 కోవిడ్ వ్యాక్సిన్లు రాగా వాటిని 26,500 మందికి వేసేందుకు అవకాశం ఉంది. అయితే మొదట విడతలో ఆరోగ్య సిబ్బందికి మాత్రమే నిర్ధేశించిన సంగతి అందరికి విదితమే. ఇప్పటి వరకు 21,943 మంది ఆరోగ్య సిబ్బంది నమోదు అయ్యారు. మొదటి విడత వాక్సినేషన్ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలను మినహాయించారు. ప్రతి కోవిడ్ వాక్సినేషన్ కేంద్రం వద్ద వ్యాక్సినేషన్ చేయు బృందంలో మహిళ పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వాక్సినేషన్ అధికారి, అంగన్వాడికార్యకర్త, ఆషా కార్యకర్త సభ్యులుగా బృందాన్ని ఏర్పాటు చేసారు. ప్రతి వ్యాక్సినేషన్ కేంద్రానికి ఒక వైద్యాధికారిని నిర్వహణాదికారిగా నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి ధర్మాన క్రిష్ణదాస్ మాట్లాడుతూ కోవిడ్ నివారణకు వాక్సినేషన్ రావడం ముదావహమన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడి, రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి కరోనా కట్టడికి మంచి చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. మొదటి విడతలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బందికి వాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. మొదటి డోస్ అనంతరం 28 రోజులకు రెండవ డోస్ ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

వాక్సినేషన్ మంచి కార్యక్రమం అని కరోనా మహమ్మారి నుండి రక్షణ కవచమని చెప్పారు. రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం మాట్లాడుతూ దేశం గర్వించదగిన రోజు అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం ముందంజలో ఉందని చెప్పడానికి వాక్సిన్ తయారీ కార్యక్రమం గొప్ప ఉదాహరణ అన్నారు. కరోనా కట్టడికి దేశంలోనే రాష్ట్రం ముందంజలో ఉందని, అనేక చర్యలు చేపట్టిందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఈ కార్య క్రమంలో శాసన సభ్యులు ధర్మాన ప్రసాద రావు, జిల్లా కలెక్టర్ జె నివాస్, వార్డు, గ్రామ సచివాలయ విభాగం జాయింట్ కలెక్టర్ డా.కె.శ్రీని వాసులు, అదనపు ఎస్.పి పి.సోమశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవి కుమార్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఏ.కృష్ణ మూర్తి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ.కృష్ణ వేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.సి.చంద్ర నాయక్, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బి.జగన్నాథ రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ఎల్. భారతీ కుమారి దేవి, డిటిటి పి.ఓ డా.జె.కృష్ణమోహన్., మునిసిపల్ మాజీ చైర్మన్ ఎం.వి.పద్మావతి, రిమ్స్ హెచ్.డి.ఎస్ సభ్యులు వరుదు విజయ కుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, దేవ భూషణ్ రావు., ప్రకాష్, రమేష్., వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



## సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలలో ముగ్గుల పోటీలు



భీమునిపట్నం : స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలలో డాక్టర్ ప్రతాప్ పాస్టర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గులపోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మొదటి స్థానం కె. వెలంగని, రెండవ స్థానం పి.వెలంగని, మూడవ స్థానం ఎ స్వర్ణ లకు వచ్చాయి.ఈ రంగవల్లుల పోటీకి. మూడో వాడ్ వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి మైలపల్లి భారతి షణ్ముఖ రావు మరియు కోట పద్మ రాణి జడ్జిగా వ్యవహరించారు. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ ప్రైజ్ కూడా అంద జేశారు. ఈ సందర్భంగా మైలపల్లి భారతి షణ్ముఖ రావు మాట్లాడుతూ ఈ పాఠశాలలోనే తన ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేశానని, ఇదే పాఠశాల పోటీలకు జడ్జీలుగా రావడానికి కారణం తన చిన్నతనంలో ఈ పాఠశాలలో నేర్పించిన విద్యతోపాటు క్రమశిక్షణ కారణమని అన్నారు.

ఈ పాఠశాలకు ఎటువంటి అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్ తీసుకెళ్లి తగిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

## సంక్రాంతి సంబరాలు

విశాఖపట్నం : ద్వారకా నగర్ పరిధిలోగల దొండపర్తి నెహ్రూ బజార్ హై స్కూల్ పక్కా ఎస్సీ కాలనీ నందు గ్రేటర్ విశాఖ ఎస్సీ, ఎస్టి, బీసీ, వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు గంటా శంకర్ స్థానిక ప్రజలను ఆకట్టుకుంది. సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ముగ్గులు పోటీలు గాలిపటాలు పోటీలు జరిగాయి అనంతరం సెక్రెటరీ కరెడ్ల అప్పలరాజు చిన్న పిల్లలకు పండ్ల గాలిపటాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులక ఉచితంగా కంప్యూటర్ కోర్స్ నేర్పిస్తున్న అన్నారు వివిధ వార్డుల్లో మరియు ఈ పోటీల్లో 1 బహుమతి 2 బహుమతి 3 బహుమతి ఇవ్వ గా మిగతా వారికి పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు ,, అందజేశారు కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా డైరెక్టర్ ఏపీ రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ భాగ్యలక్ష్మి మహిళా ప్రతినిధి పిల్లూరి చిట్టి సుజాత ఛాయాదేవి నారాయణమ్మ బిఏ, బిఎల్, అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ సిహెచ్ సత్య, సెక్రెటరీ కరెడ్ల అప్పలరాజు, ఆర్గనైజర్, ఏ నూక రత్నం ఆర్గనైజర్ కె నూకరాజు బర్రి నరేష్ జి శాంతి కుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరు కూడా తనకున్న దానితో కొంత
## ఇతరులకు దానధర్మాలు చేయాలి
### ద్రోణంరాజు శ్రీనివాస్ కుమార్ శ్రీవత్సవ

విశాఖపట్నం : మకర సంక్రాంతి సందర్భంగా విశాఖపట్నం బురుజుపేట దగ్గర శనివారం వస్త్ర దానం దుప్పట్లు షిరిడి సాయి బాబా టెంపుల్ దగ్గర మరియు వివేకానంద సంస్థ దగ్గర గూడెం కిరణ్ కుమార్ ఆర్థిక సహాయం చేశారు. ముఖ్య అతిథులుగా ద్రోణంరాజు శ్రీనివాసు కుమారుడు శ్రీవత్సవ మరియు సిటీ మోటర్ టాకీస్ వెంకటేశ్వర రావు మరియు సమాజ సేవకుడు శ్యామలరావు మరియు వైయస్ ఆర్‌సీపీ 29వవార్డు ఊరిటి నారాయణరావు పాల్గొన్నారు. జర్నలిజంలో కూడా ఇలాంటి సామాజిక సేవ కలిగి ఉండడం చాలా గొప్ప తనం చాటి చెబు తున్నారు. ప్రతి ఒక్కరు కూడా తనకు తోచింది తనకున్న దానితో కొంత ఇతరులకు దానధర్మాలు చేయా లని ద్రోణంరాజు శ్రీనివాస్ కుమార్ శ్రీవత్సవ చెప్పారు.

## ముగిసిన సీఆర్పీఎఫ్ బాలల సంక్రాంతి సంబరాలు

విశాఖపట్నం : గత నాలుగు రోజులుగా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) విశాఖ నగర శాఖ,జి.వి.ఎం.సి.స్టాఫ్ ఎండ్ వర్కర్స్ యూనియన్,సమాచార హక్కు చట్టం కార్యకర్త త్రిమూర్తులు ఆధ్వర్యంలో వెంకోజీ పాలెం లోని జ్ఞానానంద ఆశ్రమం, జనరేషన్ యువ వీధి బాలల హోం కి చెందిన అనాథ, పేద పిల్లల మధ్య నిర్వహించిన సంక్రాంతి సంబరాలు శనివారంతో ముగిశాయి. భోగి రోజు భోగిపళ్లు తో మొదలైన కార్యక్రమం మకర సంక్రాంతి రోజున,వివిధ రకాల పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేసి గాలిపటాలు ఎగురవేసారు,క్విజ్ పోటీలు నిర్వహించారు. కనుమ రోజున శుక్రవారం అంత్యాక్షరి, పాటలు పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభా పాటవాలు కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. చివరి రోజైన ముక్కనుమ శనివారం నాడు జివిఎంసి స్టాఫ్ యండ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ జనరల్ వి.వి.వామన రావు ముఖ్య అతిథిగా హాజరై నిత్యవసర వస్తువులు, ఫ్యాన్లు,దుప్పట్లు, వివిధరకాల స్వీట్లు అందజేశారు. అనంతరం వామన రావు మాట్లాడుతూ సీఆర్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం నేతృత్వంలో ఇటు విశాఖ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చక్కని సేవలు అందిస్తున్నారని అన్నారు. ఫోరం రాష్ట్ర వ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తూ చక్కని సేవలు అందించి బాలలకు మరింత చేరువకావాలన్నారు. ఈ కార్య క్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల, కె.ఎల్లయ్య, ప్రతినిధులు డాక్టర్ ఎం.కల్యాణి,డాక్టర్ జగ్గారావు, సురేంద్ర, పి.శేఖర్,కరుణాకర్,ఎం.చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన 50 మంది



కొయ్యూరు : కొయ్యూరు మండలం బూదరాళ్ల గ్రామ పంచాయతీకి చెందిన కొత్తపల్లికి చెందిన కొర్రా త్రినాధ్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది కార్యకర్తలు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకులగాంధీ సమక్షంలో బిజెపిలో చేరారు. కొర్రా సుందరరావు, బోసంగి సింహాచలం, నేరేడు బాలరాజు మొదలైన ప్రధానమైన వ్యక్తులు పార్టీలో చేరారు.

ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండల బిజెపి అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు, జెడ్పీటీసీ అభ్యర్థి కూడా నూకరాజు, జికెవీధి మండల అధ్యక్షులు బోండ్ల చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు రీమలపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీ హోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై కొలువై యున్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శు క్రవారం చండీ హోమము ఘనంగా నిర్వహించారు.ఉదయం 9 గం.లకు పండి తులు విఘ్నేశ్వర పూజ,పుణ్యాహ వచనం, అమ్మ వారికి మూల, మంత్ర జపములు, సప్తపతి పారా యణములు నిర్వ హించారు.11 గంట లకు పూర్ణ హుతి గావించారు. పూజా కార్య క్రమా లను కొంపెల్ల మూర్తి, కూచి బొట్ల ప్రసాద్, చిట్టెం నగేష్, మరియు వేద పండితులు, అర్చ కులు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్య నిర్వహణాధికారి వి.త్రినాధ రావు, ఏసి రమేష్‌బాబు మరియు ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వేద పండితుల వేద ఆశీర్వాదములు అనంతరం తీర్థ,ప్రసాదములు అందజేశారు.

# వైఎస్సార్‌ను మెప్పించి తెచ్చిన 77ఎకరాల్లో 8,912 టిడ్కో గృహాలు

**- 36 వార్డుల్లో 7,669 గృహాల పంపిణీకి ఏర్పాట్లు** **- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని**

గుడివాడ : సరిగ్గా 13ఏళ్ళ కిందట అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డిని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత రాష్ట్ర పౌర సరఫరాలు, వినియో గదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంక టేశ్వరరావు (నాని) మెప్పించి తెచ్చిన 77ఎకరాల్లో 8,912 టిడ్కో గృహాలను నిర్మించి గుడివాడ పట్ట ణంలోని అర్హులైన పేదలకు వాటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2004లో తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా ఎన్నికైన మంత్రి కొడాలి నాని 2007నాటికి నియోజకవర్గంలో దాదాపు 10వేల మందికి ఇళ్ళస్థలాలు ఇవ్వాలంటూ అనేక రూపాల్లో ఉద్యమాలను ఉధృతం చేశారు. గుడివాడ నుండి మచిలీపట్నం కలెక్టరేట్‌కు కూడా పాదయాత్ర నిర్వహించారు. చివరకు హైదరాబాద్ వరకు పాదయాత్ర చేసి దివంగత రాజశేఖరరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. 2008లో గుడివాడ రూరల్ మండలం మల్లాయిపాలెం పరిధిలో 77ఎకరాల భూములను రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చింది. ఈ భూముల్లో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కల్గిన 1,584 గృహాలు, 365 చదరపు అడుగుల విస్తీర్ణం కల్గిన 992 గృహాలు, 430 చదరపు అడుగుల విస్తీర్ణం కల్గిన 6,336 గృహాలను నిర్మిస్తున్నారు.



గుడివాడ నియోజకవర్గంలో ఇళ్ళస్థలాల సమస్యపై 2007లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్సార్‌తో మాట్లాడుతున్న మంత్రి కొడాలి నాని



గుడివాడలో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను లబ్ధిదారులకు చూపిస్తున్న మంత్రి కొడాలి నాని

ఇళ్ళపట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నిర్మాణంలో ఉన్న 8,912 టిడ్కో గృహాల్లో మొదటి విడతగా 7,669 గృహాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కల్గిన గృహానికి రూ.500లు చొప్పున లబ్ధిదారుని వాటాతో పాటు బ్యాంక్ రుణం చెల్లించాల్సి ఉంది. సీఎం జగన్మోహనరెడ్డి అధికారంలోకి రాకముందు 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే గృహాలను రూ.1లకే ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. దీంతో గుడివాడ పట్టణంలో 1,584 మంది లబ్ధిదారులకు ఉచితంగా 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే టిడ్కో గృహాలను అందజేయనున్నారు. ఈ గృహాల లబ్ధిదారులు చెల్లించిన రూ.500ల్లో ఒక రూపాయిని మినహాయించి మిగతా రూ.499లను తిరిగి లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. అలాగే 365 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే గృహాలకు లబ్ధిదారుడు చెల్లించాల్సిన రూ.50వేల మొత్తాన్ని రూ.25వేలకు, 430చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే గృహాలకు లబ్ధిదారుడు చెల్లించాల్సిన రూ.లక్షను రూ.50వేలకు తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.


అలాగే రివర్స్ టెండరింగ్ ద్వారా టిడ్కో గృహ నిర్మాణాలు జరుగుతుండడంతో 365, 430 చదరపు అడుగుల్లో నిర్మించే ఇళ్ళకు సంబంధించి లబ్ధిదారుడు చెల్లించాల్సిన రుణం కూడా భారీగా తగ్గనుంది. ఈ మేరకు మంత్రి కొడాలి నాని కూడా టిడ్కో గృహాల లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలో ముందున్నారు. ఇటీవల సుమారు 5వేల మంది టిడ్కో గృహాల లబ్ధిదారులను మల్లాయిపాలెంలో ఇళ్ళనిర్మాణం జరుగుతున్న ప్రాంతానికి తీసుకువెళ్ళి ఆయా గృహాల పరిస్థితిని స్వయంగా చూపించారు.

ఈ ఏడాది మే నాటికి 4వేల ఇళ్ళను, డిసెంబర్ నాటికి మిగతా ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తి చేయించి లబ్ధిదారులకు అప్పగించే పనిలో మంత్రి కొడాలి నాని నిమగ్నమయ్యారు. అలాగే టిడ్కో గృహాల సముదాయంలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయలను కూడా కల్పిస్తున్నట్టు మంత్రి కొడాలి నాని తెలిపారు.




# బరువు తగ్గించే రాగి అంబలితో ఎన్నో లాభాలు..!

**ధాన్యపు గింజలైన రాగుల్లో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. అవి మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే రాగులతో తయారు చేసే అంబలిని తాగడం వల్ల మనకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రధానంగా బరువు తగ్గుతారు. ఇంకా చాలా లాభాలే ఉన్నాయి. ఈ క్రమంలో రాగి అంబలిని ఎలా తయారు చేయాలో, దాంతో మనకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.**



రాగులను కొంత పరిమాణంలో తీసుకుని వాటిని కొన్ని గంటల పాటు నీటిలో నానబెట్టాలి. అనంతరం వాటిని శుభ్రమైన వస్త్రంలో కట్టి మళ్లీ కొన్ని గంటల పాటు ఉంచితే అవి మొలకెత్తుతాయి. కొన్ని సార్లు రాగులు మొలకెత్తడం ఆలస్యం కూడా అవచ్చు. అయినా కొంత సేపు నిరీక్షించి మొలకెత్తిన రాగులను సేకరించాలి. వాటిని బాగా ఎండబెట్టి దంచి పొడి చేయాలి. ఆ పొడిని కొంత నీటిలో వేసి బాగా ఉడికించాలి. దీంతో జావ తయారవుతుంది. ఇందులో అవసరం అయితే జీడిపప్పు, పల్లీలు, కిస్మిస్, తేనె వంటివి కలుపుకోవచ్చు. లేదంటే ఉప్పు, కారం కూడా కలపవచ్చు. అలా కలుపగా వచ్చేదే రాగి అంబలి. దీన్ని నిత్యం తాగితే మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది.

1. రాగి అంబలి శరీరానికి మంచి బలాన్ని ఇస్తుంది. రోజంతా శరీరానికి కావల్సిన శక్తి, పోషకాలు రాగి అంబలి ద్వారా అందుతాయి. దీంతో ఎక్కువ సేపు పనిచేయవచ్చు. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.

2. ఎదిగే పిల్లలకు దీనిని ఇవ్వడం వల్ల శక్తివంతంగా తయారవుతారు. చదువుల్లో బాగా ప్రతిభను కనబరుస్తారు. మెదడు చురుగ్గా ఉంటుంది.

3. రాగి అంబలికి చలువ చేసే గుణం ఉంది. దీంతో శరీరంలో ఉండే అధిక వేడిని తగ్గించుకోవచ్చు.

4. ఒక గ్లాస్ రాగి అంబలి తాగినా చాలా సేపు ఆకలి వేయదు. దీంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం ఎక్కువగా తినాలనిపించదు. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మేలు చేస్తుంది. స్థూలకాయం ఉన్న వారు రాగి అంబలి తాగితే వేగంగా బరువు తగ్గవచ్చు.

5. ప్రతి రోజూ ఉదయం చేసే సాధారణ అల్పాహారానికి బదులుగా రాగి అంబలి తాగితే దాంతో మనం రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. శారీరక ద ృఢత్వం చేకూరుతుంది.

6. బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. రక్తస్రావం జరుగుతున్న వారికి రాగి అంబలి తాగిస్తే స్రావం ఆగిపోతుంది.

7. రాగి అంబలిని నిత్యం తాగుతుంటే పురుషుల్లో వీర్యం వ ృద్ధి చెందుతుంది.

# అనారోగ్య సమస్యలను మటుమాయం చేసే నువ్వుల నూనె...

**ఇప్పుడంటే అన్నీ రిఫైన్డ్ నూనెలు వచ్చాయి కానీ ఒకప్పుడు మన వాళ్లు గానుగల్లో ఆడించిన నూనెలనే ఎక్కువగా వాడేవారు. అలాంటి నూనెల్లో నువ్వుల నూనె కూడా ఒకటి. తెల్లనివి, నల్లనివి అని రెండు రకాలుగా ఈ నువ్వులు ఉంటాయి. వీటి నుంచి తీసే నూనెలో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. మన శరీరానికి అవసరమైన విటమిన్ ఇ, కాల్షియం, జింక్, ఐరన్, థయామిన్, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో మనకు పుష్కలంగా లభిస్తాయి. ఈ క్రమంలో నువ్వుల నూనెను నిత్యం మన ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**



1. నువ్వుల నూనెలో విటమిన్ ఇ, బిలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని సంరక్షించడమే కాదు, అన్ని రకాల చర్మ సమస్యలను దూరం చేస్తాయి. నువ్వుల నూనెను తరచూ వాడడం వల్ల ముఖం కాంతివంతమవుతుంది. చర్మం మ ృదువుగా మారుతుంది.

2. నిత్యం స్నానం చేసే ముందు చిన్న పిల్లలకు నువ్వుల నూనెతో మర్దనా చేస్తే వారి శరీరం బాగా ఎదుగుతుంది. మెదడు పదునుగా మారుతుంది. చిన్నారుల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. ఈ నూనెలో ఉండే పోషకాలన్నీ పిల్లలకు లభిస్తాయి. అయితే పెద్దలు కూడా స్నానానికి ముందు నువ్వుల నూనెతో మర్దనా చేసుకోవచ్చు.

3. నువ్వుల నూనెలో ఒమెగా-3,6 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బీపీని తగ్గిస్తాయి. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ నిల్వలను తగ్గిస్తాయి.

4. కాపర్, ఇతర పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో ఉంటాయి. దీంతో ఇవి కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి.

కొద్దిగా నువ్వుల నూనెను తీసుకుని కొంచెం వేడి చేసి మోకాళ్లపై రాసుకుంటే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి.

5. పైన చెప్పిన విధంగా నువ్వుల నూనెను శరీరంపై కొవ్వు ఉన్న ప్రాంతాల్లో రాస్తే అధికంగా ఉన్న కొవ్వు కరిగిపోతుంది.

6. నువ్వుల నూనెలో ఉండే పోషకాలు ఎముకలకు ద ృఢత్వాన్ని ఇస్తాయి. రక్తనాళాలను శుభ్రం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి.

7. మధుమేహ వ్యాధి గ్రస్తులు నిత్యం 2 టేబుల్ స్పూన్ల మోతాదులో నువ్వుల నూనెను ఏవిధంగానైనా తీసుకుంటే వారి శరీరంలోని రక్తంలో ఉండే చక్కెర స్థాయిలు తగ్గుముఖం పడతాయి. దీని వల్ల షుగర్ నియంత్రణలో ఉంటుంది.

8. నువ్వుల నూనెతో తలకు మర్దనా చేస్తే జుట్టు బాగా పెరుగుతుంది. వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. చుండ్రు సమస్య పోతుంది.

# చిన్నారుల్లో డిప్రెషన్



ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది. ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# మహిమాన్వితం.. శివగంగ ఆలయం

పద్మాకారంలో ఆలయం. కింద గం గమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహాదుతేమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివ ృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఈ ఆల యం దినదినాభివ ృద్ధి చెందుతూ..భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. ఈకోవెల 6తేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. - మహేశ్వరం



కాకతీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడేస్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తేశ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమ ృతేశ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్టకామేశ్వరుడు, శ్రీముకేశ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణికరి?కేశ్వరుడు, శ్రీమహానందీశ్వరుడు, శ్రీఅమరావతీశ్వరుడు, శ్రీకాశీపతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆలయాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మించడం విశేషం. సహజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిషి‘ంచారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

**చరిత్రకు నిలువుటద్దం గడికోట**

కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ ఆర్చ్‌లతో పాటు మధ్యలో ఉన్న కొలను ను అదుతేంగా నిర్మించారు.

**మహత్యం..త్రివ ృక్షం...:**

ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివ ృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవ ృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.

**శివగంగకు దారి ఇలా..:**

ఆలయం హైదరాబాద్ నుంచి 25 కిలో మీటర్లు దూరంలో ఉంటుంది. ఫలక్‌నుమా, మిధాని, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ డిపోల నుంచి బస్సు సౌకర్యం ఉంది. జూబ్లీబస్ స్టేషన్ నుంచి మహేశ్వరానికి 253/ 90కె, చార్మినార్ నుంచి 253 ఎం, 253 కె, 253 టి, 253 హెచ్, సికింద్రాబాద్ నుంచి 8ఎ/ 253ఎం. జూబ్లీహిల్స్ నుంచి 253 ఎం, బస్సులు ఎక్కాలి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఔటర్‌రింగ్ రోడ్డు మీది నుంచి తుక్కుగూడ వరకు వచ్చి శ్రీశైలం రహదారి మీదుగా మహేశ్వరం గేట్ కమాన్ నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.

**ఆలయ చరిత్ర...**

తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విషు? భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది. 1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.

**శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయం**



# ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా అవుతుంది. 20 శాతం ప్రోటీన్లు ఉన్న భోజనం చేసే వారితో పోలిస్తే 15 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం తీసుకునే వారు ఒక రోజులో 260 క్యాలరీలు ఎక్కువగా తీసుకుంటారు. 70 శాతం అదనపు క్యాలరీలు మనం రోజూ తినే చిరు తిండ్లతోనే సమకూరుతుంది. సంవత్సరం గడిచే సరికి సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోల బరువు కూడా పెరుగుతాము. దీన్ని నివారించాలంటే మాంసం, చేపలు, కోడిగుడ్ల వంటి ఆహారాన్ని సాధారణంగా తీసుకునే దాని కన్నా ఎక్కువగా తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల నిష్పత్తి తగ్గితే ఆకలి పెరుగుతుంది. తద్వారా ఇంకా తింటాం. దీంతో శరీరంలో కెలరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారాన్ని స్వీకరించడంలో సమతుల్యత, వైవిధ్యం, మితంగా వ్యవహరించడం అనేవి ఆరోగ్యకరమైన అలవాటు. అలా అని ఒకేసారి తినేదాని కంటే అధికంగా పట్టించినా ఇబ్బందే. ఒక్కసారే ఎక్కువ మొత్తంలో తినేకంటే రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడమే ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ క్యాలరీలు పొందకుండా, ఒకే దానిని అతిగా స్వీకరించకుండా అనేక రకాలు ఆహార పదార్థాలను కొంచెంగా తీసుకోవడం మంచిది. పోషక పదార్థాలు అధికంగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోండి. ఈ లెక్కన మంచి ఆరోగ్యం కోసం వైవిధ్యమైన 30 నుంచి 35 రకాల పోషక పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఆహారం కూడా అన్నింటినీ అందించదు. మీ దినసరి ఆహార ఎంపికలో పప్పు ధాన్యాలతో చేసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, పాల పదార్థాలు, మాంసం, చేపలు ఉండేలా చూసుకోవాలి.

దీని కోసం టైం టేబుల్‌ను తయారు చేసుకుని దాన్ని పాటించాలి. రోజు ఎన్ని కెలరీలను ఖర్చు చేయగలమో అంత మోతాదులోనే ఆహారం తీసుకోవాలి. ధాన్యాలు, పండ్లు, పప్పులు, కూరగాయలను అధికంగా తీసుకోండి. పచ్చి కూరగాయలు తీసుకుంటే పోషకాలు నేరుగా అందుతాయి. అన్నంలో, చపాతీల్లో కూర ఎక్కువ తినాలి. రోజు ఎంత తినాలి? అనే విషయంలో మన చేసే పని, ఎత్తు, ప్రస్తుత బరువు, వయస్సు, స్త్రీ, పురుషుడు ఇలా పలు లక్షణాలను అంచనా వేయాల్సి ఉంటుంది.

అధిక బరువు శరీరానికి చేటు చేస్తుంది. ఎత్తుకు సరిపోయేలా బరువు వుంటే చాలు. ఈ విషయంలో వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోండి. మితాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఆహారాన్ని తీసుకోవడంలోనూ సమయపాలన తప్పనిసరి.

# కోవిషీల్డ్ టీకా ప్రక్రియను వీడియో కాన్ఫరెన్స్ లో ప్రారంభించిన భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ

- దేశంలో అతి పెద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమం - జిల్లాకు 46 వేల 500 డోసుల కోవిషీల్డ్ వేక్సిన్
- జిల్లాలో ప్రస్తుతం 32 కేంద్రాల(సైట్స్) ద్వారా టీకా వేయడం, మరో 221 కేంద్రాలు(సైట్స్ గుర్తింపు)
- జిల్లాలోని చినవాల్తేరులోని కోవిషీల్డ్ మొదటి టీకాను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్





విశాఖపట్నం : జిల్లాకు 46 వేల 500 డోసులు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో చినవాల్తేరులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోవిడ్-19 నివారణకు కోవిషీల్డ్ టీకాను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ ఈ టీకాను ఈ నెల 16వ తేది నుండి మొదటి దశ ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాకు 46 వేల 500 డోసులు వచ్చినట్లు తెలిపారు. ఈ డోసులను జిల్లాలో 32 సైట్స్ (సెషన్స్) ద్వారా మొదటి దశలో ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ కేర్ వర్కర్లు, తదితరులు ఉన్నట్లుల్ల ఆయన వివరించారు. రెండవ దశలో రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయితీ ఫ్రంట్ లైన్ వారియర్స్ కు ఉంటుందన్నారు. మొదటి దశలో 5 రోజులు వరకు పరిమితంగా వ్యాక్సినేషన్ జరుగుతుందని చెప్పారు. రెండవ డోసు 28 రోజులకు ఉంటుందని తెలిపారు. వ్యాక్సిన్ వేసుకున్నా జాగ్రత్తలు (మాస్క్ ధరించడం, దూరం పాటించడం, శానిటైజర్ వినియోగం వంటివి) తప్పనిసరిగా పాటించాలన్నారు. జిల్లాలో మరో 221 కేంద్రాలు (సైట్స్)ను గుర్తించినట్లు పేర్కొన్నారు.

ఇందులో పి.హెచ్.సి.లు, సి.హెచ్.సి.లు, టీచింగ్ హాస్పిటల్స్, ప్రైవేట్ హాస్పిటల్స్, తదితరమైనవి గుర్తించినట్లు చెప్పారు. ఈ నెల 20వ తేదీ తర్వాత మిగతా సైట్స్ లో టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అన్ని కేంద్రాల వద్ద రిఫ్రిజిరేటర్లు, లబ్దిదారులు వేచియుండు గది, టీకా వేయుగది, పరిశీలన గది ఉంటాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ప్రతి రోజు గరిష్టంగా వంద మంది వరకు టీకాలు వేయడం జరుగుతుందని, ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వ్యాక్సినేషన్ ఉంటుందని స్పష్టం చేశారు. ఎలర్జీవంటివి ఏవైనా ఉన్నాయని ముందుగానే అడిగి తెలుసుకుంటారని, కాంట్రా ఏడ్వర్స్ ఉన్నవారికి టీకా ఇవ్వడం జరగదన్నారు. జిల్లాలో 15 శాసన సభ నియోజక వర్గాలు ఉండగా ఇందులో పట్టణ పరిధిలో 5, గ్రామీణ ప్రాంతంలో 10 ఉన్నాయని, ఆయా నియోజక వర్గాలలో ప్రత్యేక అధికారు లుగా ప్రస్తుతం ఉన్నవారినే కొనసాగిస్తున్నట్లు ఆయన వివరించారు. పట్టణ పరిధిలో జివియంసి కమీషనర్, ఏజెన్సీ పరిధిలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, గ్రామీణ పరిధిలో జిల్లా జాయింట్ కలెక్టర్లు ఇన్ చార్జ్ లుగా వ్యవహరిస్తారనిచెప్పారు. కమ్యూనిటీ హెల్త్ కేంద్రాలలో ఎ.ఇ.ఎఫ్. కమిటీలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తూర్పు నావికా దళాలకు 1170 డోసులు పంపడమైనదని పేర్కొన్నారు. కోవిన్ అనే సాఫ్ట్ వేర్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. నగర పోలీసు కమిషనర్, ఎస్.పి.లతో గత మూడు రోజులుగా కోవిషీల్డ్ టీకా సెక్యూరిటీ గూర్చి చర్చించడమైనదని తెలిపారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం నంబర్ 104 ఉంటుందని, సమస్యలు ఉంటే 104 కు ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మోస్ట్ ఎఫెక్టెడ్ వారికి వ్యాక్సిన్ అందించడం జరుగుతుందన్నారు. మూడవ దశలో 50 సంవత్సరాలు దాటిన వారికి, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న50 సంవత్సరాలు లోపల వారికి వ్యాక్సినేషన్ ఉంటుందని చెప్పారు. ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. పి.వి. సుధాకర్ మాట్లాడుతూ టీకా తీసుకున్నానని, జ్వరం, నొప్పి, తదితరమైనవి వచ్చినా గాభరా పడాల్సిన పనిలేదని చెప్పారు. టీకా వేసిన తర్వాత 30 నిమిషాలు గదిలో పరిశీలనలో ఉండాలన్నారు. రెండవ డోసు తీసుకున్న తర్వాత వ్యాధి నిరోధక శక్తి శరీరంలో పెరగడం మొదలవుతుందని, గతంలో ఎలర్జీ ఉందా లేదా అని ముందుగానే అడిగి వ్యాక్సిన్ ఇస్తారని తెలిపారు. జిల్లాలో మొదటి టీకాను చిన వాల్తేరులోని పట్టణ ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన ఆశా కార్యకర్త ఎస్. సాయిలక్ష్మికి వేశారు. రెండవ టీకాను ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. పి.వి. సుధాకర్ కు వేశారు. అంతకు ముందు కోవిడ్-19 నివారణకు కోవిషీల్డ్ టీకా వేయడమనేది ప్రపంచంలోనే అతి పెద్ద కార్యక్రమని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడి తెలిపారు. శనివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కోవిషీల్డ్ టీకా ప్రారంభ ప్రక్రియను వర్చువల్ విధానంలో ఆయన ప్రారంభించారు. ప్రపంచమంతా వ్యాక్సిన్ కోసం ఎదురుచూస్తోందని, చాలా తక్కువ సమయంలో కరోనా వ్యాక్సిన్ వచ్చిందన్నారు. శాస్త్రవేత్తల కృషి ఫలితంగా రెండు దేశీయ టీకాలు వచ్చాయని, శాస్త్రవేత్తలు రేయింబవళ్లు కష్టపడి వ్యాక్సిన్లు తయారు చేశారని ప్రశంసించారు.

ఈ సందర్భంగా వ్యాక్సిన్ తయారు చేసిన శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. ఎన్నో సవాళ్ల మధ్య వ్యాక్సిన్ వచ్చిందని చెప్పారు. మొదటగా వ్యాక్సిన్ పొందడానికి ఆరోగ్య సిబ్బంది అర్హులని, ఆ తర్వాత పారిశుద్ధ్య సిబ్బందికి ఇస్తామన్నారు. ఆ తర్వాత సైనికులు, మిగిలిన వారికి ఇస్తామని తెలిపారు. చినవాల్తేరులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి నిర్వహించిన వీడియో కాన్ఫ రెన్స్ లో జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. పి.వి. సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.సూర్యనారాయణ, సియంఓ డా. శాస్త్రి, జివియంసి జోనల్ కమీషనర్ సన్యాసినాయుడు, యుసిడి పిడి శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ ధవళ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## జివిఎంసి స్టాండింగు కౌన్సిల్ దరఖాస్తులు ఆహ్వానం



విశాఖపట్నం :- మహా విశాఖ నగరపాలక సంస్థ నందు స్టాండింగు కౌన్సిల్ ఎనిమిది జోన్ల వారిగా నియామకం చేపట్టడానికి సంబందిత కేటగిరీలకు చెందిన న్యాయవాదుల నుండి దఖాస్తులు స్వీకరించే నిమిత్తం విశాఖపట్నం బార్ కౌన్సిల్ అధ్యక్షులవారికి లేఖను పంపినట్లు జివిఎంసి కమిషనర్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులకు విజ్ఞప్తి చేస్తూ వారి యొక్క దరఖాస్తులను తేది. 23-01-2021 లోపు కమిషనర్ జివిఎంసి వారికి పంపించాలని విజ్ఞప్తి చేసారు. అర్హతలకు సంబందించి అన్ని వివరములు జిల్లా కోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షులు వారిని గాని, లేదా జివిఎంసి ప్రధాన కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పరిపాలన విభాగం వారిని గాని పనివేళలో సంప్రదించవలసినదిగా కమిషనర్ కోరారు.

## కర్నూలు విమానాశ్రయానికి డీజీసీఏ అనుమతి

ఓర్వకల్లు : ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా నిర్మించిన కర్నూలు విమానాశ్రయంలో విమాన రాకపోకలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి లభించింది. ఈ మేరకు మార్చి నుంచి విమానాల రాకపోకలు, కార్యకలాపాలకు ఏరోడ్రోమ్ లైసెన్స్ జారీ చేసినట్లు కర్నూలు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. విమానాశ్రయ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఏడాది మార్చిలో ఆదేశించారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తి చేసి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. పనులు పూర్తయిన అనంతరం ఇటీవల దిల్లీ నుంచి డీజీసీఏ అధికారుల బృందం విమానాశ్రయంలోని మౌలిక వసతులు, ఇతరత్రా అంశాలను పరిశీలించి వెళ్లారు. విమానాశ్రయంలో అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో డీజీసీఏ అనుమతి లభించినట్లు అధికారులు తెలిపారు.

## కోవిడ్ వేక్సినేషన్ కేంద్రాలు పరిశీలించిన అదనపు కమిషనర్



విశాఖపట్నం :- దేశ వ్యాప్తంగా ప్రారంభమైన వేక్సినేషణ్ ప్రక్రియలో భాగంగా విశాఖపట్నం నగరంలో కూడా ప్రభుత్వం ఫ్రంట్ లైన్ వారియర్స్ కు గుర్తించిన కేంద్రాలలో వేక్సినేషణ్ అందించుట జరుగుచున్నది. నగరంలో ఏర్పాటు చేసిన కోవిడ్ కేంద్రాలలో జివిఎంసి చేపట్టిన ఏర్పాట్లు తీరుతెన్నులను జివిఎంసి కమిషనర్ ఆదేశాలమేరకు కార్పోరేషన్ అదనపు కమిషనర్ డా. వి. సన్యాసి రావు, జివిఎంసి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కె.ఎస్.ఎల్.జి. శాస్త్రి కలసి పరిశీలించారు.

18వ వార్డు పరిధిలోని చిన్నవాల్తేరులో గల పట్టణ ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన కోవిడ్ వేక్సినేషణ్ సెంటరును పరిశీలించి, అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫ్రంట్ లైన్ వారియర్స్ కు వేక్సినేషణ్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కె.ఎస్.ఎల్.జి. శాస్త్రి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వంద రోజుల్లో.. 10కోట్ల మందికి టీకా : బైడెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా తాను బాధ్యతలు చేపట్టాక తొలి వంద రోజుల్లో 10కోట్ల మందికి కొవిడ్ వ్యాక్సిన్ అందజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు జో బైడెన్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన గతేడాది నుంచి దేశంలో నెలకొన్న ఆరోగ్య సంక్షోభంపై శుక్రవారం తన బృందంతో నిర్వహించిన సమావేశంలో చర్చించారు. 'దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ ఘోరంగా విఫలమైంది. మేం బాధ్యతలు చేపట్టాక తొలి వంద రోజుల్లోనే 10కోట్ల మందికి వ్యాక్సిన్ అందజేయడం మా లక్ష్యంగా పెట్టుకున్నాం. అలా చేయడం సాధ్యమయ్యే పనేనా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కానీ మేం దాన్ని చేసి చూపిస్తాం. లక్ష్యాలను ధైర్యంతో అధిగమించాల్సిన తరుణమిది. ఎందుకంటే ప్రస్తుతం మన దేశ ఆరోగ్యం ప్రమాదంలో ఉంది. ప్రాధాన్యతా విభాగాల ప్రకారం.. వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేసేందుకు రాష్ట్రాలతో కలిసి పనిచేస్తాం. మరింత మందికి వ్యాక్సిన్ అందజేసేలా రాష్ట్రాలను ప్రోత్సహించి ప్రక్రియలో ఉన్న సమస్యల్ని అధిగమిస్తాం. వ్యాక్సిన్ అందుబాటును దృష్టిలో ఉంచుకుని ఫ్రంట్‌లైన్ వర్కర్స్‌కు టీకాలను కొనసాగిస్తూనే.. దేశవ్యాప్తంగా ఫార్మసీల వినియోగాన్ని పెంచుతాం. అంతేకాకుండా మొబైల్ క్లినిక్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుని ప్రక్రియ వేగవంతం అయ్యేలా కృషి చేస్తాం' అని జో తెలిపారు.

## ఏపీ మత సామరస్యానికి ప్రతీక

### వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు



తాడేపల్లి: ప్రతిపక్ష నేత చంద్రబాబు మతి భ్రమించి మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని, తిరిగి అధికారంలోకి రాలేననే భయంతో విషప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. "ఏపీ మత సామరస్యానికి ప్రతీక.. మతాల మధ్య ఘర్షణ లేనే లేదు. టీడీపీ, బీజేపీ కలిసి చేసిన ఉదంతాలు బయటకొస్తున్నాయి. మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తే సహించం.బూట్లు వేసుకుని పూజలు చేసే నీకు హిందూత్వంపై ప్రేమ ఉందా. అఖిలప్రియ విషయంలో చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదు. కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తే ఉక్కుపాదంతో అణచి వేస్తామని" అంబటి రాంబాబు హెచ్చరించారు.

## కావాలనుకుంటే లోకేష్ మీద కేసు పెట్టలేమా?

### మంత్రి అనిల్‌కుమార్ యాదవ్



తాడేపల్లి : దేవాలయాలపై, విగ్రహాలపై జరుగుతున్న దాడులపై డీజీపీ గౌతమ్ సవాంగ్ స్పష్టంగా వివరణ ఇచ్చారని మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఇందులో టీడీపీ హస్తం ఉందనే నిజం ఎక్కడ బయట పడుతుందో అనే భయం వారిలో కనిపించిందన్నారు. ఒక్కసారిగా అందరూ బెంబేలెత్తారని, గుంపులు, గుంపులుగా ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంత్రి అనిల్ శనివారం మాట్లాడుతూ.. విగ్రహాలు పగులగొట్టినా పర్లేదు కానీ నిజాలు బయటకు రాకూడదని టీడీపీ నేతలు ఆలోచిస్తున్నారని దుయ్యబట్టారు. ఇలా చేస్తే ఎవరికి లాభం అన్నది అందరికీ అర్థం అవుతుందన్నారు. ఇవన్నీ దురుద్దేశాలతో రాజకీయాల కోసం చేసినవిగా కనిపిస్తున్నాయని విమర్శించారు. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టడం చంద్రబాబు ఒక్కడికే తెలుసని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అన్ని కేసుల్లో మీ పాత్ర ఉందని చెప్పలేదు కదా. కొన్నింటిలో మీ పాత్ర ఉంది. మేము కావాలనుకుంటే లోకేష్ మీద కేసు పెట్టలేమా.. దురుద్దేశం మీకుందా.. మాకుందా. అఖిలప్రియ కేసులో స్పందనే లేదు..కానీ ఈ 9 కేసులపై మాట్లాడుతున్నారు. 9 కేసుల్లో ఉన్న వారు మీవారు కాదా...గుండెలపై చెయ్యి వేసుకుని చెప్పగలరా.. పలు సంఘటనల్లో తప్పుడు ప్రచారం చేసే ప్రయత్నం టీడీపీ వారిది కాదా.. రాజమండ్రి వినాయక విగ్రహానికి అపవిత్రం చేశారన్న కేసులో బుచ్చియ్య చౌదరి అనుచరులు కాదా..? తిత్లీ తుఫానులో విగ్రహం దెబ్బ తినడాన్ని ఓ బీజేపీ నేత దుష్ప్రచారం చేశారు. దుర్గ గుడిలో క్షుద్ర పూజలు చేసిన నీచ చరిత్ర నీకుంది. విగ్రహాలు పగలగొట్టొచ్చు కానీ వాస్తవాలు బయటకు వస్తుంటే నారా వారి నరాల్లో వణుకు పుడుతోంది ఎక్కడ తమ బండారం బయటపడుతుందో అని చెప్పి మా పై దాడి చేసే పరిస్థితి. భగవంతుడితో ఆడుకున్న వారు ఎవరూ బాగుపడ్డట్లు చరిత్రలో లేదు. కనీసం ఈ రోజుకైనా ఆ టీడీపీ వారిని సస్పెండ్ చేశారా.. కరోనాలో ఎన్నో సంఘట నలు జరిగినా బయటకు రాలేదు.

## పశ్చాత్తాపం లేదు.. అలానే ఆడతా : రోహిత్

### విమర్శలపై స్పందించిన హిట్‌మ్యాన్

బ్రిస్బేన్ : బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఆఖరి టెస్టులో టీమిండియా స్టార్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ ఔటైన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుదురుకున్న హిట్‌మ్యాన్ అనవసర షాట్‌కు ప్రయత్నించి ఔటవ్వడం విస్మయానికి గురిచేసిందని మాజీలు సునీల్ గావస్కర్, సంజయ్‌మంజ్రేకర్, ఆకాశ్ చోప్రా విమర్శించారు. అది బాధ్యతారాహిత్య మైన షాట్ అని విశ్లేషించారు. సామాజిక మాధ్యమాల్లోనూ రోహిత్‌ను నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. అయితే తనపై వస్తున్న విమర్శలకు రోహిత్ బదులిచ్చాడు. ఆ షాట్ ఆడినందుకు పశ్చాత్తాపం లేదని అన్నాడు. గతంలో అదే టెక్నిక్‌తో విజయవంతంగా బౌండ రీలు సాధించిన సందర్భాలను గుర్తుచేశాడు. బౌలర్లపై ఒత్తిడి తెచ్చేందుకు అలాంటి షాట్‌లు ఆడతానని, ఇకపై కూడా కొనసాగిస్తానని తెలిపాడు. రెండో రోజు ఆట ముగిసిన అనంతరం రోహిత్ మీడియా సమావేశంలో మాట్లాడాడు.

"ఆ షాట్ ఆడినందుకు పశ్చాత్తాపం పడట్లేదు. బౌలర్లపై ఒత్తిడి పెంచడానికి అలాంటి షాట్‌లు ఆడతాను. లైయన్ తెలివైన బౌలర్. కష్టతరమైన బంతుల్ని విసురుతున్నాడు.

## రేపటి నుంచి విద్యుత్ టారిఫ్ పై ప్రజాభిప్రాయ సేకరణ

### వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా మూడురోజుల పాటు విశాఖపట్నంలో నిర్వహణ

విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) వారి అధ్వర్యంలో విద్యుత్ చార్జీల (టారిఫ్) పై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం రేపటి (18వ తేదీ) నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి జరుగుతాయి. 2021-22 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు మరియు రిటైల్ ధరలపై ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, సభ్యులు పి.రాజగోపాల్ రెడ్డి, ఠాకూర్ రామ్ సింగ్ అధ్వర్యంలో 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రతి రోజు అన్ని డిస్కంలకు సంబంధించిన సూచనలు/అభ్యంతరాలు/అభిప్రాయాలను అభ్యంతరదారుల నుంచి స్వీకరిస్తారు.

ఈ బహిరంగ విచారణలో ఏపీఈఆర్సీ అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఏపీ ట్రాన్స్కో, ఏపీఈపీడీసీఎల్, ఏపీసిపిడిసిఎల్, ఏపీఎస్పీడీసీఎల్ ఉన్న తాధికారులు పాల్గొంటారు. కరోనా (కోవిడ్ -19) కారణంగా మూడు విద్యుత్ పంపిణీ సంస్థలకు సంబంధించిన బహిరంగ విచారణలు వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా విశాఖపట్నం నుంచే జరుగుతాయి. 'అభ్యంతర దారులు తమ పరిధిలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం/డివిజన్ కార్యాలయం ద్వారా వీడియో కాన్ఫెరెన్స్ లో పాల్గొనవచ్చు. ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుండి ఒంటి గంట వరకు, రెండు గంటల నుండి సాయంత్రం 4.30 వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు http://www.eliveevents.com/apercpublichearing లింకు ద్వారా ప్రత్యక్ష ప్రసారం (లైవ్ స్ట్రీమింగ్) పొందవచ్చు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com